వైఎస్ఆర్-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
బుధవారం 11 జనవరి 2023

## ఆరుగాలం రైతు శ్రమ.. అడవి పందుల పాలు..!!



చిట్వేలి, జనవరి 10 ప్రభాతవార్త

ఆరుగాలం రైతు కష్టించి పండిస్తున్న పంట అడవి పందుల రూపంలో నేలపాలుగా మారి రైతన్నను కష్టాల సుడి గుండంలోకి నెట్టుతున్నాయి. గత నెలలో వర్షాల ప్రభావంతో అరటి, బొప్పాయి, పసుపు రైతులు అతి తీవ్రంగా నష్టపోయి ఇప్పుడిప్పుడే కోలుకొంటున్నారు. కాగా చిట్వేలి మండల పరిసర ప్రాంతల్లోని పలు గ్రామాల్లో.. గ్రామ సమీపంలోనే పొలాల పంటలు ఉన్నప్పటికీ, చీకటి పడితే చాలు అడవి పందులు గుంపులు గుంపులుగా పొలాలపై పడి అరటి, బొప్పాయి, పసుపు, పూల సాగు తదితర పంటలపై దాడిచేసి ధ్వంసం చేస్తున్నాయి. రైతులకు కంటిమీద కునుకు లేకపోగా, సాగుచేసిన పంటలను చేతికందే సమయంలో రైతులు నష్టపోతున్నారు. ప్రస్తుతం ఉన్న సాంకేతికతను ఉపయోగించుకుని సోలార్ కంచెను ఏర్పాటు చేసుకుంటే కొంతమేర పందుల బెడద తగ్గే అవకాశం ఉన్నప్పటికి సోలార్ ఏర్పాటు రైతుపై మరింత ఆర్థికభారంగా మారింది. ఒక ఎకరాకు 25 వేల రూపాయల ఖర్చు వస్తుందని రైతులు వాపోతున్నారు. అధికారులు రైతులకు కలుగుతున్న నష్టాన్ని ప్రభుత్వానికి నివేదించి సోలార్ ఏర్పాటు విధానానికి సబ్సిడీని అందిస్తే రైతులకు మేలు జరుగుతుందని, సత్వరమే అధికారులు ఆలోచించాలని రైతన్నలు కోరుకుంటున్నారు.

## ఉరివేసుకుని యువకుడు మృతి



చిన్నమండెం.జనవరి10 ప్రభాతవార్త

మండల పరిధిలోని చాకిబండ గ్రామం అంబాబత్తిన వారి పల్లికి చెందిన బూసా విజయ్‌కుమార్ (20) అను యువకుడు మంగళవారం మధ్యాహ్న సమయంలో ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని మృతి చెందినట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. వివరాలలోకి వెళితే విజయ్‌కుమార్ బెట్టింగ్‌లు, మానసికంగా బాధపడుతూ ఉండేవాడని దీంతో దిక్కుతోచని పరిస్థితులలో ఉరివేసుకుని మృతి చెందినట్లు వారి బంధువులు ఇచ్చిన పిర్యాదులో పేర్కొన్నట్లు ఈమేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతున్ని పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అనంతరం వారి బంధువులకు అప్పజెప్పినట్లు తెలిపారు. మృతుని తల్లి కువైట్‌లో ఉండగా అతను మేనమామ వద్ద ఉన్నట్లు తెలిసింది. ఈ విషయంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్‌లు తెలిపారు.

# గణతంత్ర దినోత్సవ వేడుకలకు పక్కా ఏర్పాట్లు చేయండి

### కలెక్టర్ విజయ రామరాజు





కడప, జనవరి 10 ప్రభాతవార్త :

74వ గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణకు పక్కా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ లోని సభాభవన్ నందు 74వ గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణకు చేయాల్సిన ముందస్తు ఏర్పాట్లపై జాయింట్ కలెక్టర్ సాయికాంత్ వర్మ, డిఎఫ్ఓ సందీప్ రెడ్డి, ట్రైనీ కలెక్టర్ రాహుల్ మీనా, డిఆర్వో గంగాధర్ గౌడ్‌లతో కలసి అన్ని శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..ఈ నెల 26న స్థానిక పోలీసు పెరేడ్ గ్రౌండ్ లో నిర్వహించే వేడుకల్లో.. జెండా వందన కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను, వేదికను అందంగా అలంకరించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజాప్రతినిధులు, స్వాతంత్ర సమర యోధుల కుటుంబ సభ్యులు, ఇతర అతిథులను వేడుకలకు ప్రత్యేకంగా ఆహ్వానించాలని సంబందిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమానికి హాజరైన వారికి తాగునీటిని సరఫరా, మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేయాలని కడప మునిసిపల్ కమీషనర్‌ను ఆదేశించారు.ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల సంక్షేమ పథకాలు, అభివృద్ధికి సంబంధించి జిల్లాలో సాధించిన ప్రగతిని చాటిచెప్పేలా శకటాలు, ఎగ్జిబిషన్ స్టాళ్ళను ఏర్పాటు చేయాలని డిఆర్డీఏ, డ్వామా, హార్టికల్చర్, ఏపీఎంఐపీ, జల వనరుల శాఖ, వ్యవసాయము, ఎస్సీ కార్పొరేషన్, బీసీ కార్పొరేషన్, డియంహెచ్ఓ, ఆప్కో, చేనేత, తదితర శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఉదయం పెరేడ్ మైదానంలో, సాంస్కృతిక కార్యాక్రమాల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను కన్నుల పండువగా సాగేలా సంసిద్ధం చేయాలని డీఈవోను ఆదేశించారు. పెరేడ్ మైదానంలో రంగు కాగితాలు, పూల అలంకరణతో శోభాయమానంగా తీర్చిదిద్దాలన్నారు. ముఖ్యంగా.. ఆయా శాఖల్లో విశిష్ట సేవలు అందించిన ఉత్తమ అధికారులు, సిబ్బంది, ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేయడానికి సంబంధిత ప్రతిపాదిత జాబితాను నిర్ణీత గడువు లోపు అందించాలని ఆదేశించారు. జాతీయ పతాక ఆవిష్కరణ, పోలీసుల మార్చి ఫాస్ట్ లో ఎన్ సిసి కేడెట్లను భాగస్వామ్యం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కోవిడ్-19 ప్రభావం నేపథ్యంలో ప్రతి ఒక్కరూ సామాజిక, భౌతిక దూరం పాటించేలా సీట్ల ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కడప ఆర్డీవో ధర్మచంద్రా రెడ్డి, డ్వామా పీడి యదుభూషన్ రెడ్డి, సిపివో వెంకట రావు, రిమ్స్ సూపర్ ఇన్ టెండెంట్ డా.వెంకటేశ్వర రావు, ఆర్ అండ్ బి ఎస్ ఈ మహేశ్వర రెడ్డి, పంచాయతీ రాజ్ ఎస్ ఈ శ్రీనివాస రెడ్డి, జడ్పి సీఈఓ సుధాకర్ రెడ్డి, గృహనిర్మాణ శాఖ పీడి కృష్ణయ్య, ఎస్ సి కార్పొరేషన్ ఈడి వెంకట సుబ్బయ్య అన్ని శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో క్రీడాభివృద్ధికి కృషి

### క్రికెట్ స్టేడియం పనులను త్వరితగతిన పూర్తి చేయండి : జిల్లా కలెక్టర్ గిరీషా పిఎస్

### అత్యంత సుందరంగా క్రికెట్ స్టేడియం పనులు చేపట్టాలి: ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి






రాయచోటి. రాయచోటి అర్బన్, జనవరి 10 ప్రభాతవార్త

జిల్లాలో క్రీడాభివృద్ధికి కృషి చేస్తున్నామని జిల్లా కలెక్టర్ గిరీషా పిఎస్ అన్నారు. మంగళవారం రాయచోటి పట్టణ సమీపంలోని నక్కలవాండ్లపల్లి సమీపంలో క్రికెట్ స్టేడియం ఏర్పాటుకు సంబందించి క్షేత్రస్థాయిలో భూమి చదును పనులను జిల్లా కలెక్టర్ గిరీషా పిఎస్, ప్రభుత్వం విప్ మరియు శాసనసభ వ్యవహారాల సమన్వయకర్త, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డిలు సంయుక్తంగా కలిసి పరిశీలించారు. సాధ్యమయినంత త్వరగా క్రికెట్ స్టేడియం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ సూచించారు. ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నాడని పేర్కొన్నారు. అత్యంత సుందరంగా క్రికెట్ స్టేడియం పనులు చేపట్టాలని, అధికారులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, ఏపిఐఐసి డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి, ఇతర ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ కమీషనర్ రాంబాబు అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

### ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం : ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరాను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని ఆదిల్‌నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభంలో శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. పట్టణంలోని ఆదిల్‌నగర్ నందు ఉన్న నివాసిత గృహాలు లోఓల్టేజ్ విద్యుత్‌తో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. ప్రజలు అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని త్వరితగతిన అదనపు 100 కెవి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని శ్రీకాంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశం ప్రకారం అదనపు ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేసి నేడు ప్రారంభించడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లు ఫయాజ్‌బాష, ఫయాజుర్‌రెహమాన్, వైఎస్సార్‌సిపి నాయకులు బేపారి మహమ్మద్‌ఖాన్, ఫయాజ్ అహమ్మద్, ఎస్‌పిఎస్ రిజ్వాన్, హజరత్ ఖాదర్‌వలి, ఏపిఎస్‌పిడిసిఎల్ అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నాడు-నేడు ఫేస్-2 పనుల్లో జిల్లాను మొదటి స్థానంలో నిలపాలి

### జాయింట్ కలెక్టర్ సాయికాంత్ వర్మ




కడప, జనవరి 10 ప్రభాతవార్త :

నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా.. మనబడి "నాడు నేడు" పనులను సకాలంలో పూర్తి చేసి జిల్లాను రాష్ట్రంలో మొదటి మూడు స్థానాల్లో నిలపాలని జేసి సి.ఎం. సాయికాంత్ వర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ సభా భవన్ లో మనబడి నాడు నేడు ఫేస్-2 పనుల పురోగతి పై విద్యాశాఖ, ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీ ఇంజ నీరింగ్ అధికారులతో జాయింట్ కలెక్టర్ సాయి కాంత్ వర్మ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ సాయి కాంత్ వర్మ మాట్లాడుతూ.. మనబడి నాడు నేడు రెండవ దశలో భాగంగా జిల్లాలో 40% పైగా పాఠశాలల్లో మంజూరైన టాయిలెట్లు, ఎలెక్ట్రికల్, కాంపౌండ్ వాల్, అదనపు తరగతి గదులు, కిచెన్ షెడ్స్, మేజర్, మైనర్ రిపేర్లు మొదలైన అరురకాల అభివృద్ధి పనులను సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఫోటో కాప్చర్స్ తీసి వారం లోపు పంపించాలన్నారు. రూ.288 కోట్లతో జిల్లా వ్యాప్తంగా 998 పాఠశాలలు, 9 జూనియర్ కాలేజీలలో చేపట్టిన పనులు నాణ్యతలో సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల్లో నాణ్యత లోపాలు వుంటే సంబంధిత అధికారుల పైన చర్యలు తప్పవని అన్నారు. అదేవిధంగా మండల స్థాయిలో మండల విద్యాశాఖ అధికారి, ఇంజనీరింగ్ అధికారి ఎప్పటికప్పుడు ప్రతి పనిని తనిఖీ చేస్తూ నివేదికలందించాలని తెలిపారు. పనులు ఎప్పటికప్పుడు గ్రామ, వార్డు సచివాలయం ఇంజనీర్స్ ఫొటోస్ ద్వారా ఆన్లైన్లో ఎస్టిఎంఎస్ లో నమోదు చేసి వాటి పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి చెప్పలి దేవరాజు, ఐసిడిఎస్ పీడి ఎం.ఎన్.రాణీ, పంచాయతీరాజ్ ఎస్.ఈ. శ్రీనివాసుల రెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్.ఈ. వీరన్న, ఏపీ ఈడబ్ల్యుఐడీసీ ఈఈ కరుణాకర్ రెడ్డి, సమగ్ర శిక్ష ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చంద్రశేఖర్, మండల ఇంజనీర్లు, మండల విద్యాశాఖ అధికారులు సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారులు, సమగ్ర శిక్ష కంట్రోల్ రూమ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గణతంత్ర దినోత్సవ వేడుకలను పండుగ వాతావరణంలో నిర్వహించాలి

### వేడుకలకు సంబందించి అధికారులకు కేటాయించిన విధులను బాధ్యతగా పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ గిరీషా పిఎస్

### అధికారులందరి సమన్వయంతో గణతంత్ర వేడుకలను విజయవంతం చేయాలి : ఎస్పీ హర్షవర్ధన్‌రాజు



రాయచోటి.జనవరి 10 ప్రభాతవార్త

74వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలను పండుగ వాతావరణంలో నిర్వహించి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పిఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నదు ఎస్పీ హర్షవర్ధన్‌రాజుతో కలిసి ఈనెల 26న స్థానిక పోలీస్ గ్రౌండ్‌లో నిర్వహించే 74వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలు ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సదర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్నమయ్య నూతన జిల్లాలో గత ఏడాది ఆగస్టు 15న మొదటిసారిగా నిర్వహించిన భారత స్వాతంత్ర దినోత్సవ వేడుకలను అధికారులందరూ సమన్వయంతో బాగా నిర్వహించారని, అలాగే ఈ సారికూడా భారత గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు బాద్యతాయుతంగా కృషి చేయాలన్నారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రతిబింబిస్తూ వివిధ శాఖలు ఏర్పాటు చేసే శకటాల ప్రదర్శన ఆకర్షణీయంగా అందరినీ ఆకట్టుకునేలా ఉండాలన్నారు. జాతీయ జెండా ఎగురవేయుట, వేదిక అలంకరణ, సీటింగ్ ఏర్పాట్లు, తాగునీటి ఏర్పాట్లు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు జారీ, ప్రోటోకాల్ మేరకు ఆహ్వాన పత్రికలు పంపిణీ తదితర అంశాలలో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి పలు సూచనలు జారీ చేశారు. 26న ప్రతి సచివాలయంలో జాతీయ జెండా ఎగురవేసేలా తగు ఉత్తర్వులు జారీ చేయాలని డిఆర్‌వోకు సూచించారు.

### సమన్వయ స్ఫూర్తితో వేడుకలను విజయవంతం చేయాలి :ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

అధికారులందరూ సమన్వయ స్ఫూర్తితో ఈనెల 26న జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని ఎస్పీ ఆకాంక్షించారు. స్థానిక పోలీస్ పెరేడ్ మైదానంలో గత ఆగస్టులో నిర్వహించేందుకు వేడుకలు అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి మరింత ఘనంగా వేడుకలను నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు. పోలీస్ శాఖ తీసుకోవలసిన అన్ని చర్యలను పటిష్టవంతంగా పూర్తి చేయడం జరుగుతుందని ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌వో సత్యనారాయణ, ఆర్డీవో రంగస్వామి వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## పిఎం శ్రీ పాఠశాలలతో నాణ్యమైన విద్య

### ఆర్జేడి వెంకటక్రిష్ణారెడ్డి



సంబేపల్లి.జనవరి 10 ప్రభాతవార్త

మౌళిక వసతులు కల్పించి సాంకేతిక సొబగులతో ప్రభుత్వ పాఠశాల విద్యను తీర్చిదిద్దడమే కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన పిఎం శ్రీ పాఠశాలల లక్ష్యమని పాఠశాల విద్య, కడప ఆర్జేడి మార్తాల వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. వివిధ మండలాల్లో పిఎంశ్రీ పాఠశాలలుగా ఎంపికైన వాటి తనిఖీల లో భాగంగా మంగళవారం ఉదయం పిఎం శ్రీ పాఠశాలగా ఎంపికైన సంబేపల్లి మండలంలోని ప్రకాష్‌నగర్‌లోని ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల ప్రతిభకు మరింత పదును పెట్టి, ఉపాధి మార్గాలకు పాఠశాల దశలోనే పునాదులు వేయడానికి పిఎంశ్రీ పాఠశాలలు దోహదపడుతాయన్నారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరికి నాణ్యమైన విద్య అందించడానికి, విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన వివిధ పథకాల సక్రమ అమలుకు పాఠశాలలపై విస్తృత తనిఖీలు చేపట్టామన్నారు. ఉపాధ్యాయులందరూ తప్పనిసరిగా తమ పాఠ్యాంశాలకు సంబందించి పాఠ్యప్రణాళిక, టీచింగ్ డైరీని కలిగి ఉండాలన్నారు. విద్యార్థికి అన్ని టెక్స్ట్‌బుక్స్ బైలింగువల్ పద్ధతిలో అందాయా లేదా అని ప్రధానోపాధ్యాయులు సరి చూసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి పాఠశాలకు వచ్చేటప్పుడు తప్పనిసరిగా జగనన్న విద్యా కానుక షూ, బ్యాగ్ వంటివి తప్పక కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబేపల్లి స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం మడితాటి నరసింహారెడ్డి, ఎంఈవో శ్యామలాదేవి, ఎంఎవో బాలాజి, ఉపాధ్యాయులు అమీనా ,సిఆర్‌పిలు తదితరులు పాల్గొన్నారు.

# 'వార్త' దినపత్రిక ఆధ్వర్యంలో రంగవల్లుల పోటీలు

### సాంప్రదాయం ఉట్టిపడేలా తీర్చిదిద్దిన రంగవల్లులు - సంక్రాంతిని తలపించిన పోటీలు

### రంగవల్లుల పోటీలకు విశేష స్పందన - పెద్ద ఎత్తున పాల్గొన్న మహిళలు








మాట్లాడుతున్న తహసీల్దారు మల్లిఖార్జున రెడ్డి.అర్బన్ సీఐ వెంకటేశ్వర్లు. జూటూరు డిజిటల్స్ అధినేత జూటూరు మధుసూదన్‌రావు.

బద్వేలు అర్బన్, జనవరి 10 ప్రభాతవార్త :

'వార్త' దినపత్రిక ఆధ్వర్యంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని బద్వేలులో నిర్వహించిన రంగవల్లుల పోటీలకు పెద్ద ఎత్తున మహిళలు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటారు. ప్రతి యేటా వార్త దినపత్రిక ఆధ్వర్యంలో సాంప్రదాయాన్ని గుర్తు చేస్తూ నిర్వహించే పోటీలకు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొంటారు. మంగళవారం బద్వేలు మార్కెట్ యార్డులో నిర్వహించిన రంగవల్లుల పోటీల్లో సాంప్రదాయం ఉట్టిపడేలా మహిళలు రంగవల్లులు తీర్చిదిద్దారు. కనీవినీ ఎరుగని రీతిలో 6 విలువైన ప్రోత్సాహక బహుమతులను మహిళలకు అందజేయడం జరిగింది. సంక్రాంతి సంబరాలలో భాగంగా మహిళలు మూడు రోజులు ఇంటి ముంగిట రంగవల్లులు ఎలా వేస్తారో అదే విధంగా తీర్చిదిద్ది వారి ప్రతిభకు వార్త బహుమతిగా ఇవ్వడం ఆనవాయితీగా వస్తున్న తరుణంలో నేడు చేపట్టిన కార్యక్రమానికి విశేష స్పందన లభించడంతో పాటు మహిళలు ఉత్సాహంగా పాల్గొని రంగవల్లులను తీర్చిదిద్దారు.

**మహిళల ప్రతిభకు 'వార్త' దినపత్రిక పట్టం - తహసీల్దారు మల్లిఖార్జున రెడ్డి :**

నేటి 'వార్త' దినపత్రిక ఆధ్వర్యంలో ప్రతి యేటా మహిళలకు రంగవల్లుల పోటీలు నిర్వహించి వారి ప్రతిభకు పట్టం కట్టడం అభినందనీయం అని తహసీల్దారు మల్లిఖార్జున రెడ్డి అన్నారు. అంతే కాకుండా వార్త యాజమాన్యం ఈ విధమైన పోటీలు నిర్వహిస్తూ మహిళలను ప్రోత్సహిస్తూ మహిళలు అన్ని రంగాలలో ముందుకు రావాలని యాజమాన్యం నిర్వహిస్తున్న ఈ రంగవల్లుల పోటీలకు విశేష స్పందన రావడమేగాక పోటీతత్వాన్ని పెంచుకోవడం శుభ సూచకం అన్నారు. సంక్రాంతి అంటేనే సాంప్రదాయాలకు నిలయం అని, అలాంటి పండుగ జరుపుకునే మూడు రోజుల ముందు ఈ కార్యక్రమం చేపట్టి వారిలో ఉత్సాహం పెంచడం గొప్ప విషయం అన్నారు. వారు గెలుచుకునే బహుమతి ఎంతో ఆనందాన్ని ఇస్తుందని, ప్రతి మహిళ పోటీలో పాల్గొన్నపుడే విజేతగా నిలుస్తారని, ఏ ఒక్కరూ నిరుత్సాహపడకూడదని, ఈ పోటీ వారికి ఉత్సాహాన్ని ఇవ్వడమేగాక ఆనందాన్ని ఇస్తూ వారి గెలుపుకు నాంది పలుకుతుందన్నారు. అయితే వార్త యాజమాన్యం సంక్రాంతిని దృష్టిలో పెట్టుకొని సాంప్రదాయ పద్ధతిలో ముగ్గులు వేయాలని వారికి సూచించడం, వారిలో పట్టుదలతో ఇంత మంది మహిళలు ఈ పోటీలలో పాల్గొని పోటీని పెంచుకునే ప్రయత్నాలు చూస్తుంటే చాలా సంతోషంగా ఉందన్నారు. ఎప్పుడూ కష్టపడే మహిళలు ఆటవిడుపుగా ఉండేందుకు వార్త యాజమాన్యం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం చాలా గొప్ప విషం అని, గతంలో నేను పనిచేసిన తూరు ప్ గోదావరి జిల్లాలో కూడా సాంప్రదాయాలకు పట్టం కట్టేలా పోటీలు జరుగుతాయని, అయితే ఈ ప్రాంతంలో ఈ విధమైన మహిళలకు పోటీలు నిర్వహించడం చాలా గొప్ప విషయం అన్నారు.

**సాంప్రదాయానికి నిలయం సంక్రాంతి సంబరాలు - అర్బన్ సిఐ వెంకటేశ్వర్లు :**

తెలుగు వారి సాంప్రదాయాలకు నెలవైన సంక్రాంతి సంబరాలలో భాగంగా 'వార్త' దినపత్రిక ఆధ్వర్యంలో నిర్వహించిన రంగవల్లుల పోటీల్లో ఇంత మంది మహిళలు పాల్గొనడం చాలా గొప్ప విషయం అని అర్బన్ సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. ఎంత చదువులు చదివినా, ఎంత దూరంలో ఉన్నా, ఎంత సంపాదించినా సాంప్రదాయాలే మన దేశ కీర్తి ప్రతిష్ఠలు అని, వాటిని ఎన్నటికీ మరువకుండా ఉండాలంటే ఇలాంటి సంబరాలు జరుగుతుండాలన్నారు. ఇంటి ముందు మహిళలు ముగ్గులు వేయడం ఆనవాయితీగా వస్తుందని, అయితే ఇలాంటి పోటీలలో మహిళలు పాల్గొని వారి ప్రతిభకు గుర్తింపు తెచ్చుకోవడం గొప్ప విషయమన్నారు. ఇంత మంది మహిళలు వార్త దినపత్రిక ఆధ్వర్యంలో నిర్వహించిన రంగవల్లుల పోటీల్లో పాల్గొనడం గొప్ప విషయమని, ఈ సాంప్రదాయాలకు నిలయంగా మారిన సంక్రాంతి సంబరాలు మొదటి నుంచే ఉత్సాహంగా పాల్గొని ప్రజల్లో కష్టాలు తొలగిపోయి అష్టైశ్వర్యాలతో ఆరోగ్యంగా ఉండాలని, ప్రతి ఒక్కరూ సాంప్రదాయాలను మరువకుండా ఉండాలన్నారు. మహిళలకు ఉన్న శక్తి ఏ ఒక్కరికీ ఉండదని, వారి శక్తిని ఎప్పటికీ వంటింటికే పరిమితం చేయకుండా వారి ప్రతిభను బయటికి తేవాలంటే ఇలాంటి పోటీలలో పాల్గొని తమ ప్రతిభ చాటేందుకు వార్త ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించడం అభినందనీయం అన్నారు.

**సాంప్రదాయాలకు నిలయం వార్త దినపత్రిక - 'వార్త' మేనేజర్, బ్యూరో రఘునాథ్ :**

ప్రతి యేటా సంక్రాంతి పురస్కరించుకొని ముగ్గుల పోటీలను 'వార్త' దినపత్రిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరుగుతుందని, ఈ సారి పెద్ద ఎత్తున మహిళలు పాల్గొనడం సంతోషకరం అని వార్త మేనేజర్, బ్యూరో రఘునాథ్ అన్నారు. 'వార్త' ఎండీ గౌరవ్ సంఘీ ఆదేశాల మేరకు సంక్రాంతి సంబరాలు నిర్వహించి సాంప్రదాయాలకు నిలయంగా మారిన రంగవల్లుల పోటీలలో మహిళల ప్రతిభకు పట్టం కట్టడం జరుగుతుందన్నారు. (మిగతా IVవ పేజీలో)




మొదటి బహుమతి ఎల్ఈడి టీవిని అందజేస్తున్న సిఐ వెంకటేశ్వర్లు, మొబైల్ షాప్ అసోషియేషన్.




రెండవ బహుమతి వాషింగ్ మిషన్‌ను అందజేస్తున్న బొమ్మన ఫౌండేషన్ డైరెక్టర్ విజయ్.




మూడవ బహుమతి ఫ్రిడ్జ్ అందజేస్తున్న జూటూరు డిజిటల్స్ జూటూరు మధుసూదన్‌రావు.



నాల్గవ బహుమతి బీరువాను అందజేస్తున్న పద్మావతి ఫర్నీచర్ శ్రీనివాసులు యాదవ్.



ఐదవ బహుమతి, ఆరవ బహుమతులను అందజేస్తున్న పిఆర్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి మానుగుంట రవి శంకర్.



ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయ నిర్ణేతలు.



భోజన వసతికి సహకరించిన 25వ వార్డు కౌన్సిలర్ నాగిరెడ్డి శివమ్మను సత్కరిస్తున్న వార్త సిబ్బంది.



జూటూరు మధుసూదన్‌రావును సత్కరిస్తున్న వార్త సిబ్బంది.



బొమ్మన ఫౌండేషన్ డైరెక్టర్ విజయ్‌ను సత్కరిస్తున్న వార్త సిబ్బంది.



బీరువాకు సహకరించిన పద్మావతి ఫర్నీచర్ శ్రీనివాసులును సత్కరిస్తున్న వార్త సిబ్బంది.

# ప్రారంభమైన వాలీబాల్ పోటీలు

**పులివెందుల, జనవరి 10, ప్రభాతవార్త :**



స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని భారత ప్రభుత్వం, యువజన వ్యవహారాల క్రీడామంత్రిత్వ శాఖ, నెహ్రూ యువకేంద్రం, ఎస్సిఎస్ఆర్ ఫంక్షన్ హాల్ యజమాని వైకాపా కడప పార్లమెంటరీ సెక్రెటరీ సొరెడ్డి చంద్ర శేఖర్‌రెడ్డి సహకారంతో స్నేహిత అమృతహస్తం సేవా సమితి సంయుక్త ఆధ్వ ర్యంలో పులివెందుల పట్టణంలోని సీఎస్ఐ చర్చి మైదానంలో స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా నియోజకవర్గంలోని పురుషులకు వాలీబాల్ పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో పులివెందుల డీఎస్పీ శ్రీనివాసులు, సొరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మార్కెట్ కమిటి ఛైర్మన్ చిన్నప్ప, మొమ్మెల రాజులు వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. 13టీంలు వాలీబాల్ పోటీలలో పాల్గొన్నాయి. వెలిదండ్ల జట్టు విజేతగా, సీఎస్ఐ సీనియర్ జట్టు రన్నర్స్‌గా నిలిచారు. విజేత జట్టుకు ప్రశంసా పత్రాలు, రూ.3వేలు నగదు బహుమతి, మెమెంటో, మెడల్స్, రన్నర్ జట్టుకు రూ.2వేలు నగదు బహుమతి, మెమెంటో, ప్రశంసాపత్రాలు, అందజేశారు. నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువ అధికారి మణికంఠ, ఎస్సిఎస్ఆర్ ఫంక్షన్ హాల్ యజమాని సొరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, స్నేహిత అమృతహస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు, న్యాయనిర్ణేతలు శ్రీకాంత్‌రెడ్డి, ఫ్రాన్సిస్, రవికుమార్, ప్రభాకర్‌రెడ్డి, విక్టర్, సేవా సమితి సభ్యులు హరీఫ్, రాఘవేంద్రారెడ్డి, చాంద్‌బాషా, రాజా, ప్రజలు పాల్గొన్నారు.

# స్థల సమస్యను పరిష్కరించిన మున్సిపల్ ఇన్‌ఛార్జి

**పులివెందుల రూరల్, జనవరి 10, ప్రభాతవార్త :**



ఇస్లాంపురంలో ఓ స్థల సమస్యను అధికారులతో కలిసి మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి పరిష్కరించారు. అక్కడ ఉన్న కాలువలో వ్యర్థాలను తీసి వేయించాలని, శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి అజయ్ కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టరు మురళీధర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# కోడి పందెం, జూదాలపై పోలీస్ డేగకన్ను

**రామసముద్రం, జనవరి 10 ప్రభాతవార్త:**



సంక్రాంతి పండగ దగ్గర పడుతుండదంతో కోడి పందాల, జూదాలపై పోలీసులు రామసముద్రం మండలంలో ఎస్ఐ రవీంద్రబాబు నిఘాను పెంచారు. ఈ సందర్భంగా స్థానిక విలేకర్లతో మంగళవారం మాట్లాడుతూ మండలంలో ఎవరైనా, ఎక్కడైనా అసాంఘీక కార్యకలాపాలు, జూదం, సారా విక్రయిస్తూ పట్టుపడితే శిక్షలు కఠినంగా ఉంటాయన్నారు. శీతరగారిపల్లె సమీపంలో రామిరెడ్డి చింతతోపులో పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.5100లు స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్ఐ తెలిపారు. రానున్న పండగకు మండల పరిధిలో ఎవరైనా కోడిపందాలు, పేకాటలు ఆడరా దన్నారు. గతంలో ఇలాంటి కార్యక్రమాలకు పాల్పడి పట్టుబడిన పాత నేరస్తులను తహశీల్దార్ ఎదుట బైండోవర్ చేయడం జరిగిందన్నారు. అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోబడుతుందని ఎస్ఐ హెచ్చరించారు.

# సకాలంలో విధులకు హాజరుకావాలి

**రాజుపాళెం,**

**జనవరి10,ప్రభాతవార్త.**



రికార్డులను పరివలీస్తున్న డిప్యూటి డియంహెచ్ఓ శాంతికళ

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంను డిప్యూటి డియంహెచ్ఓ శాంతికళ మంగళవారం సందర్శించారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ విధులకు సకాలంలో హాజరుకావాలని ఆమె తెలిపారు. ఆరోగ్యకేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. యన్‌సిడి, సిడి సెక్రటరియేట్ వారిగా మానిటరింగ్ చేసి 25వదేది లోపు 92శాతం సాధించాలని తెలిపారు.పిసిపియన్‌డిటి ఆక్ట్ గురించి ప్రజలకు అవగాహణ కల్పించాలని తెలిపారు. ఈకార్యక్రమంలో డాక్టర్లు డి నిఖిల, మంజుల, పిహెచ్‌యన్ విమళ,యంపిహెచ్ఓ రవిశంకరరాజు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

# బిటి కళాశాలలో నేడు జాబ్‌మేళా

**మదనపల్లెక్రైం, జనవరి 10 ప్రభాతవార్త :**

ఏపి ప్రభుత్వం స్కిల్స్ డెవలప్‌మెంటు ఆధ్వర్యంలో బిటి కళాశాలలో బుధవారం మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈసందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ పరిసరాల ప్రాంతాల నిరుద్యోగుల కోసం జాబ్‌మేళాలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. హెట్రోడ్రగ్స్, అలిడక్సిన్, టిసిఎల్ కంపెనీలు ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్, ఐటిఐ, డిప్లమా, డిగ్రీ, బిటెక్, ఎంబిఏ, ఎంఎస్‌సి అభ్యర్థులు అర్హులని ప్రతి విద్యార్థి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# వ్యాపార యూనిట్లతో ఆర్థిక స్వాలంబన

**కురబలకోట, జనవరి 10 ప్రభాతవార్త:**



ఆహార శుద్ధి నిర్వహణ కొత్తవ్యాపార యూనిట్లతో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చునని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ డిఎం నీతూ అన్నారు. మంగళవారం కురబలకోటలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో ఏపిఫుడ్స్ ప్రాసెసింగ్ సొసైటి ఆధ్వర్యంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల నిర్వహణ, కొత్త వ్యాపారాలు ఏర్పాటుపై తొలివిడతగా తంబళ్ళపల్లె, పెద్దమండ్యం, బి.కొత్తకోట మండలాల మహిళా గ్రూపు సభ్యులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాంప్రదాయ పద్ధతిలో వివిధ ఆహార ఉత్పత్తులను తయారుచేయడం వల్ల ఎక్కువ ఆదాయం పొందవచ్చునని తెలిపారు. ఎక్కువ ఆహార ఉత్పత్తుల ఆధునీక, యంత్ర సామాగ్రి ద్వారా తయారు చేయడం వల్ల ఎక్కువ మందికి ఉపాధి కూడా కల్పించవచ్చునని ఆమె తెలిపారు. ప్రభుత్వం ఆహార శుద్ధి యూనిట్ల కల్పనకు రుణసౌకర్యం కూడా కల్పిస్తుందని తెలిపారు. సూక్ష్మరుణాల పథకాలపై మహిళలకు ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపిఎం నీరజ, వెలుగు సిసి శ్రీనివాసులు, సైయ్యద్‌బాషాలు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామ సచివాలయ కన్వీనర్‌గా కేశవరెడ్డి

**కురబలకోట, జనవరి 10 ప్రభాతవార్త:**



మండలంలోని పిచ్చలవాండ్లపల్లె గ్రామసచివాలయ కన్వీనర్‌గా కేశవరెడ్డిని నియ మించారు. ఈసందర్భంగా కేశవరెడ్డి మాట్లాడుతూ ప్రజాసమస్యల పరి ష్కారంకోసం నిరంతరం కృషిచేస్తానని తెలిపారు. నాపై నమ్మకంతో కన్వీనర్‌గా నియమించినందుకు ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డికి రుణపడి ఉంటానని తెలిపారు. ఎంపిపి, జడ్పిటిసి, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మెన్‌ల సహాయ సహకారాలతో పనిచేస్తానన్నారు.

# పట్టణ వ్యాపారస్తులకు ఆహ్వానం

**పీలేరు, జనవరి 10 ప్రభాతవార్తః**

స్థానిక డిపో ఆవరణంలో గల ఖాళీ స్థలంలో అత్యాధునిక కమర్షియల్ కాంప్లెక్సు మీకు నచ్చిన వ్యాపారము చేసుకోవడానికి బీఓటీ స్టాల్స్ నిర్మించుకొని వ్యాపారము చేసుకోవడానికి పట్టణ వ్యాపారస్తులు అమూల్యాఐన సలహాలు స్వీకరించుటకు శుక్రవారం ఉదయం పీలేరు డిపో మేనేజరు కార్యాలయంలో అన్నమయ్య రీజినల్ మేనేజరు జగదీష్ గారితో సమావేశం ఏర్పాటు చేయడమైనది ఈకార్యక్రమంలో ఔత్సాహికలు పాల్గొని వ్యాపార అభివద్ధికి సలహాలు సూచనలు ఇవ్వగలరని కోరుతున్నారు.

# ముస్లిం మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట : ఎంపీ

**కలికిరి, జనవరి 10 ప్రభాతవార్త :**



రాష్ట్రంలో ముస్లిం మైనార్టీల సంక్షేమానికి వైఎస్ఆర్ ప్రభుత్వం పెద్ద పీట వేస్తు న్నట్లు రాజంపేట ఎంపి వెంకట మిథున్‌రెడ్డి అన్నారు. మంగళవారం కలికిరి మండలంలో ఎంపి మిథున్ రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మండలంలో పర్యటిస్తూ పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. మండలంలోని మసీదులకు ఎంపి నిధులతో మంజూరైన నిధులకు సంబంధించిన పత్రాలను ముస్లిం మతపెద్దలకు ఎంపి, ఎమ్మెల్యేలు అందజేశారు. మండల కేంద్రంలోని అన్ని మసీదులను ఎంపి, ఎమ్మెల్యే సందర్శించి ముస్లిం పెద్దలతో కలసి ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం కలికిరి బస్టాండు సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన దివంగత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ ఛైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ మ్మ ద్‌ఖాన్, మాజీ ఎమ్మెల్యే జీవి.శ్రీనా థ్‌రెడ్డి, ఏపిఎండిసి డైరెక్టర్ హరీష్‌రెడ్డి, పీలేరు నియోజకవర్గం పార్టీ పరిశీలకులు సహదేవరెడ్డి, పీలేరు సర్పంచ్ హబీబ్ బాషా, మండల ఎంపిపి నూర్జాహాన్, జడ్పిటిసి పద్మజ లోకవర్ధన్, వైసిపి సీని యర్ నాయకులు నల్లారి తిమ్మారెడ్డి, సహకార ఛైర్మెన్ నల్లారి శ్రీకర్‌రెడ్డి, జిల్లా వైసిపి ఎస్‌సిసెల్ ప్రధాన కార్యదర్శి వి.హరి, పంచాయతీ వార్డుమెంబర్లు ఖాదర్ వల్లీ, విశ్వనాథ్, ఎంపిడిఓ గంగయ్య, తహశీల్దార్ ఫిరోజ్ ఖాన్, ట్రాన్స్‌కో ఏఈ ముజిబర్ రెహమాన్, వ్యవసాయ అధికారిణి మమతారెడ్డి, వెలుగు ఏపిఎం దేవ సేన, పంచాయతీ ఈఓ ఉదయ్‌కుమార్, మండలస్థాయి అధికారులు, ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.

# భవానీ మాలదారులకు జయరామ్‌నాయుడు బాసట

**మదనపల్లె, జనవరి 10 ప్రభాతవార్త:**



భవాని మాలదారులకు మదనపల్లె నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకులు శ్రీరామినేని జయరామ్‌నాయుడు సొంత నిధులతో యాత్రకు బస్సు ఏర్పాటు చేసిన బాసటగా నిలిచారు. మండలంలోని ఎగువమాచిరెడ్డిగారిపల్లె, బుగ్గ కాలువకు చెందిన యాత్రికుల కోసం మదనపల్లె నుంచి మేల్‌మత్తూరుకు మంగళవారం బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా జయరామ్‌నాయుడు మాట్లాడుతూ భవానీ యాత్ర ఎంతో పవిత్రమైందన్నారు. మహిళలు, పురుషులు భవానీ మాలదారణలో అమ్మవారిని దర్శించుకొని తమ భక్తిని చాటుకొంటున్నారన్నారు. వీరి సౌకర్యార్థం బస్సును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఓంశక్తి అమ్మవారి భక్తులు, నాయకులు పెంచుపాడు స్వామి, మహేశ్వరరెడ్డి, ముద్దుక్రిష్ణమరెడ్డి పాల్గొన్నారు.

# విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి : ఆర్జేడి

**మదనపల్లెక్రైం, జనవరి 10 ప్రభాతవార్త:**



విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని ఆర్జేడి వెంకట సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం మదన పల్లె రూరల్ సిటిఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఈసం దర్భంగా పాఠశాలలోని ఆటల్ టింకరింగ్, ల్యాబోరేటరిని పరిశీలించారు. విద్యార్థులు తయారు చేసిన సమూనాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పిల్లలు చిన్నప్పటి నుంచి సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు వేణుగోపాల్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు రుషికేశవు లను ఆయన అభినందించారు. విద్యార్థులు తయారు చేసిన డ్రోన్, త్రిడి ప్రింటర్ బాగున్నాయన్నారు. అనంతరం మదనపల్లెలోని ఎంఈఓ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు.

# ప్రజలు మెచ్చిన మనిషి బాలకృష్ణారెడ్డి

**వాల్మీకిపురం, జనవరి 10 ప్రభాతవార్తః**



ప్రజలు మెచ్చిన మనిషి బాల కృష్ణారెడ్డి అని తెదేపా జాతీయ కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని చింతపర్తి పంచాయతీకి చెందిన బాలకష్ణారెడ్డి(73) అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న కిశోర్ కుమార్‌రెడ్డి చింతపర్తికి వెళ్లి బాలకష్ణారెడ్డి మతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. గ్రామంలోని నిరుపేదకు ఏసమస్య ఉన్నా దగ్గర ఉండి చక్కబెట్టేవారన్నారు. అలాంటి మంచి మనిషిని కోల్పోవడం బాధాకరమని ఆయన కార్యక్రమంలో విండో మాజీ ఛైర్మన్ ద్వారకనాథరెడ్డి, తెదేపా నాయకులు శేషు, నరసింహారెడ్డి, భాస్కర్‌రెడ్డి, కాంతరాజులు వెంకటేష్‌శెట్టి, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, శివ, గిరినాయుడు నాగేంద్రరెడ్డి పాల్గొన్నారు.

# ప్రకతి వ్యవసాయ సాగు ఉత్పత్తులకే డిమాండు

**వాల్మీకిపురం, జనవరి 10 ప్రభాతవార్తః**



రసాయనిక వ్యవసాయ సాగులో వచ్చే దిగుబడులు ప్రకతి వ్యవసాయ సాగులో లభ్యమయ్యే వ్యవసాయ ఉత్పత్తులకే మార్కెట్‌లో ప్రత్యేక డిమాం డు ఉంటుం దని కేవీకే డీఆర్‌సీ టీం ఏడీఏ శ్రీకాంత్ అన్నారు. కేవీకే శాస్త్రవేత్త పీరూసాబ్ తో కలిసి ఆయన మంగళ వారం మండలంలోని సాకిరేవుపల్లెలో రైతులు సాగు చేస్తున్న ప్రకతి పంటలను పరిశీ లించి సాగుచేస్తున్న రైతుకు పలు సలహాలు సూచనలు అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రకతి ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి గిరాకీతో పాటు డిమాండు ఉండటం వలన ప్రకతి సాగు రైతుకు ఈసాగు లాభదాయకంగా ఉం టుందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది శ్రీనివాసులు, మునీర పెద్ద రెడ్డెయ్య, రెడ్డిబాషా, హరినాథరెడ్డి, అరుణ్‌కుమార్ రైతులు పాల్గొన్నారు.

# 10 విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించండి

**వాల్మీకిపురం, జనవరి 10 ప్రభాతవార్తః**



పదవ తరగతి విద్యార్తులకు పబ్లిక్ పరీక్షలు ఉన్న దష్ట్యా విద్యార్తులపై ఇప్పటి నుంచి ఉపాధ్యాయులు ప్రత్యేక దష్టి సారించాలని మదనపల్లె ఉప విద్యాశాఖ అధికారి కష్ణప్ప అన్నారు. మంగళవారం మండలంలోని మంచూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం పాఠశాల ఆవరణలో జరుగుతున్న నాడు-నేడు ఫేస్-2 నిర్మాణ పనులను పరిశీలించారు. నాడు-నేడు పథకం కింద చేపట్టే పనుల్లో ప్రత్యేకంగా నాణ్యత ఉండేలా చూడాలని కాంట్రాక్టరును ఆదేశిం చారు. కార్యక్రమంలో హెచ్ఎం అరుణ, ఉపాధ్యాయులు శ్రీనివాసులురెడ్డి, సీ ఆర్పీలు ముత్యాలు , రామస్వామి, రమణప్ప, విజయ్‌కుమార్, సులోచన పాల్గొన్నారు.

# రూ.7లక్షల నగలు చోరీ

**మదనపల్లెక్రైం, జనవరి 10 ప్రభాతవార్త:**

ఇంటిలో అందరూ ఉండగానే చోరీ జరిగింది. సుమారు రూ.7లక్షల విలువ చేసే బంగారు నగలు అపహరణకు గురయ్యాయి. ఈ సంఘటన మంగళవారం మదనపల్లెలో ఆలస్యంగా వెలుగుచూసింది. వన్‌టౌన్ పోలీసుల కథనం మేరకు పట్టణంలోని ఎన్‌విఆర్‌లేవుట్ సమీపంలోని శారదానగర్‌కు చెందిన మంజుల తులసీరాంప్రసాద్‌రెడ్డి ఇంటిలో చోరీ జరిగింది. కబ్‌బోర్డులోని అట్టపెట్టెలో ఉంచిన 150 గ్రాముల నగలు చోరీకి గురయ్యాయి. గమనించిన మంజుల మంగళశారం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీపావళి పండగకు నగలు పెట్టుకొని తరువాత అట్టపెట్టులో పెట్టి కబ్‌బోర్డులో పెట్టానని బాధితురాలు చెబుతోంది. ఇప్పుడు అవసరం వచ్చి అట్టపెట్టెలో చూడగా నగలు కనపడడం లేదని తెలిపారు. దీనిపై ఇంటిలోని పనిమనిషిపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు క్లూస్‌టీమ్‌ను రప్పించి వేలిముద్రలు సేకరించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరిహరప్రసాద్ పేర్కొన్నారు.

# పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి

**కేవి.పల్లె, జనవరి 10 ప్రభాతవార్తః**



మండలంలోని గ్రామ పంచాయతీల అభివృద్ధికి పంచాయతీ కార్యదర్శులు ప్రణా ళికలు సిద్ధం చేయవలసిందిగా ఈఓపీఆర్డీ లతీఫ్‌ఖాన్ కోరారు. మంగళ వారం ఎంపీడీఓ కార్యాలయంలో బాపట్ల ఈటీసీ వారి ఆధ్వర ్యంలో వీడియో కాన్ఫరెన్సు ద్వారా మిషన్ అంత్యోదయ గురించి శిక్ష ణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యదర్శులు తమ పరిధిలోని పంచాయతీలలో 216 గ్రామీణ సమస్యలకు స ంబంధించి సర్వే జరిపి ఫిబ్రవరి 10వ తేదీ నాటికి నివేదికలు సమర్పించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సిబ్బంది పాల్గొన్నారు.

# యువత క్రీడల పట్ల మక్కువ పెంచుకోవాలి

**ఎస్ఐ మైనుద్దీన్**

**నందలూరు, జనవరి 10 ప్రభాతవార్త**



క్రీడల ద్వారా క్రీడాకారులు శారీరక దృఢత్వంగా ఉంటారని ప్రతిఒక్కరు ఆటలు ఆడడం ద్వారా ఇది సాధ్యపడుతుందని ఎస్ఐ మైనుద్దీన్ అన్నారు. మంగళవారం నందలూరు మండలంలోని అరవపల్లె క్రీడామైదానంలో చమర్తి జగన్‌మోహన్‌రాజు సహకారంతో టిడిపి బిసిసెల్ రాష్ట్ర కార్యదర్శి సమ్మెట శివప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌లో పోలీసు టీమ్‌లో ఎస్ఐ పాల్గొన్నారు. క్రీడల ద్వారా మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడతాయని, చిన్నతనం నుండి ప్రతిఒక్కరు క్రీడల్లో పాల్గొని పోటీతత్వాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. పోలీసు లెవన్ తరపున ఆడిన పోలీసు క్రీడాకారులందరికి మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మహేష్, తోట శివశంకర్, సమ్మెట ఉమామహేశ్, కొనిశెట్టి సుదర్శన్, మాడపూరు శ్రీరాములు, ఆర్గనైజింగ్ డైరెక్టర్ పల్లె గ్రీష్మంత్‌రెడ్డి, క్రీడాకారులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ధర, దిగుబడి లేని మినుము పంట

**దువ్వూరు, జనవరి 10, ప్రభాతవార్త:**



మండలంలో ఖరీఫ్ సీజన్‌లో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసిన మినుము పంట ఈ ఏడాది ధరతో పాటు దిగుబడి కూడా లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో ఎక్కువగా గుడిపాడు, నీలాపురం, దువ్వూరు, చింతకుంట, మూడిండ్లపల్లె, కృష్ణంపల్లె తదితర గ్రామాల్లో మినుము సుమారు 5వేల ఎకరాల్లో సాగు చేశారు. ప్రస్తుతం మినుము నూర్పిడి జరుగుతున్నాయి. ఎకరాకు సుమారు రూ.20 నుంచి రూ.30వేలు ఖర్చు చేశారు. ప్రస్తుతం దిగఉబడి అంతంత మాత్రమే ఉంది. ముందుగా పంట నూర్పిడి చేసిన వారికి ఎకరాకు 6 నుంచి 8 క్వింటాల్లు దిగుబడి రాగా ప్రస్తుతం 4 క్వింటాళ్లు కూడా రాలేదని రైతులు వాపోతున్నారు. ఇటీవల వాతావరణంలో వచ్చిన మార్పు వల్ల మినుము దిగుబడి తగ్గింది. 20 రోజుల క్రితం క్వింటాళు రూ.7500 వ్యాపారస్థులు కొనేవారు. ప్రస్తుతం సుమారు రూ.1000 తగ్గింది. క్వింటాళుకు రూ.6వేలకే కొనుగోలు చేస్తున్నారు. దీంతో పెట్టుబడి ఖర్చులు కూడా రావడం లేదు. ఒకేసారి వెయ్యి తగ్గడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పెట్టుబడి ఖర్చులు అధికమయ్యాయని, ప్రస్తుతం దిగుబడి, ధర లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

# ప్రమాదకర బావిని పూడ్చిన అధికారులు

## స్పందనకు వందనం

**ఓబులవారిపల్లె, జనవరి 10, ప్రభాతవార్త:**



ఓబులవారిపల్లె మండలం జీవీపురం లోని దళితవాడలో 20 సంవత్సరాలుగా ఉన్న ప్రమాదకర బావి ఉండడంతో వార్తా కథన రూపంలో ప్రమాదకర బావి.. మరమ్మతులు చేపట్టండని వార్తాకతనం ప్రచురించడంతో స్థానిక నాయకులు, ఎండీవో విజయారావు స్పందించి బావిని పూడ్చి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# వృద్దులకు దుస్తులు పంపిణీ

**ఓబులవారిపల్లె, జనవరి 10, ప్రభాతవార్త:**



ఓబులవారిపల్లె మండలం పెద్దఓరంపాడు పంచాయతీలో ఉన్న జీవన జ్యోతి ఆనంద నిలయం వృద్ధాశ్రమంలో మంగళవారం పుల్లంపేట మండలానికి చెందిన ప్రకాష్‌నగర్ నివాసి శ్రీజ పుట్టిన రోజు సందర్భంగా వీద్దులకు దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేసి వారికి నేనున్నానంటూ భరోసా కల్పించి తమ శక్తి సామర్థ్యాల మేరకు ఆర్థిక సాయం చేస్తామన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమాలు చేపట్టిన శ్రీజకు ఆశ్రమం తరుపున నిర్వాహకులు సుబ్రమణ్యం అభినందించి ఆమెకు శాలువా కప్పి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

# ఏకవీర గంగమ్మగుడిలో చోరీ

**ఓబులవారిపల్లె, జనవరి 9, ప్రభాతవార్త:**



ఓబులవారిపల్లె పంచాయతీలోని జె.వడ్డె పల్లె గ్రామంలో కొలువుదీరిన ఏకవీర గంగమ్మ గుడిలో సోమవారం రాత్రి గుడి తలుపులు ఇనుప చువ్వలను పగలగొట్టి కొందరు గుర్తు తెలియని దుండగలు హుండీలోని సుమారు రూ.30 వేల నుంచి 40వేలు, అమ్మవారికి చేసిన తాళిబొట్లు కలిపి సుమారు రూ.లక్ష విలువ చేసే వస్తు సామగ్రి చోరీకి గురైనట్లు ఆలయ పెద్దలు, గ్రామస్థులు మంగళవారం ఓబులవారిపల్లె పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అమ్మవారికి ఎంతో ప్రేమగా బంగారు ఆభరణాలు చేయించామని వాటిని ఎత్తుకెళ్లారని గ్రామ స్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని చోరీకి పాల్పడిన దొంగలను పట్టు కొని అమ్మవారికి చెందిన ఆభరణాలు స్వాధీనం చేసుకోవాలని పోలీసులను కోరు తున్నారు. పోలీసులు విచారణ చేపట్టారు.

# నేడు వడ్డే ఓబన్న జయంతి ఉత్సవాలు

**కడప వైద్యవిభాగం, జనవరి 9, ప్రభాతవార్త:**

ఈనెల 11వ తేదీ ఉదయం 10 గంటలకు వడ్డే ఓబన్న 216వ జయంతి ఉత్సవాలను స్థానిక పాత రిమ్స్‌లోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో జరపనున్నట్లు వడ్డెర సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు జి.రమణయ్య తెలిపారు. కావునా సంఘ సభ్యులు అందరూ హాజరుకావాలని ఆయన కోరారు.

# ఉరివేసుకుని వివాహిత మృతి

**కేవి.పల్లె, జనవరి 10 ప్రభాతవార్తః**



వివాహిత మండలంలోని గర్నిమిట్టలో ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం చోటుచేసుకుంది. మండలంలోని గర్నిమిట్టకు చెందిన రెడ్డినాగేశ్వరి (23) సోమవారం రాత్రి ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గర్నిమిట్టకు చెందిన వాలంటీర్ లక్ష్మీ కారణంగానే ఆత్మహత్య చేసుకుందని భర్త మునిరాజ పోలీసులకు ఫిర్యాదుచేశారు. మతురాలి రెడ్డి నాగేశ్వరి వాలంటీర్ లక్ష్మీ భర్త అయిన నరసింహులకు కొంత నగదు అప్పుగా ఇచ్చింద. ఈవిషయమై సోమవారం రాత్రి ఇద్దరు వీధిలో గొడవ పడ్డారు. ఈగొడవలో వాలంటీర్ లక్ష్మీ రెడ్డి నాగేశ్వరిని తొట్టి కొట్టింది. రెడ్డి నాగేశ్వరి అవమానం భరించలేక వెంటనే ఇంటికి వెళ్లి ఉరివేసుకుని చనిపోయింది. భర్త మునిరాజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లోకేష్ తెలిపారు. పీలేరు ప్రభుత్వాసుపత్రిలో శవపరీక్ష నిర్వహించారు.

# బీసీలకు దామాషా ప్రకారం సీట్లు కేటాయించాలి

**కడప కార్పొరేషన్, జనవరి 10, ప్రభాతవార్త:**



జనాభా దామాషా ప్రకారం బీసీలకు చట్టసభలలో మూడు ఎమ్మెల్యే స్థానాలను వైఎస్ఆర్ కడప జిల్లాలో కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తల లింగమూర్తి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గోవింద్, నాగరాజు, ప్రధాన కార్యదర్శి కొప్పుల శివ యాదవ్‌లు రాజకీయ పార్టీలను కోరారు. జనాభాలో అధిక శాతం బీసీలు ఉన్నారని కూడా తెలిపారు. మంగళవారం కడపలోని ఆ సంఘం కార్యాలయంలో కడప మార్కెట్ యార్డు ఛైర్మన్ బంగారు గంగాదేవి, డైరెక్టర్లు బంగారు నాగయ్య యాదవ్, తొలి వేముల జయశ్రీలను బీసీ సంక్షేమ సంఘం నాయకులు సన్మానం చేశారు. బంగారు నాగయ్య యాదవ్ మాట్లాడుతూ బీసీ సంక్షేమ సంఘం అఖిల భారతీయ యాదవ మహాసభలో పని చేయడం కారణంగానే పదవులు రావడం జరిగిం దన్నారు. బీసీల సమస్యల కోసం పాటుపడుతున్నదన్నారు. కార్యక్రమంలో 21వ డివిజన్ ఇన్‌ఛార్జి మోతుకూరి సుబ్బరాయుడు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా యువజన అధ్యక్షులు సీఆర్ఐ సునీల్ జయంత్, మహిళా అధ్యక్షురాలు వల్లూరు నారాయణమ్మ, ఉపాధ్యక్షులు కళ సుదాకర్, పస్తం అంజి, సిందే రవిచంద్ర, నగర అధ్యక్షులు త్రివిక్రం, శ్రీనివాసులు, వెంకటసుబ్బమ్మ, వీరబ్రహ్మం పాల్గొన్నారు.

# బస్సు ఛార్జీలు పెంచితే కఠిన చర్యలు

**ప్రొద్దుటూరు క్రైం, జనవరి 9, ప్రభాతవార్త:**

ఆర్టీవో కార్యాలయంలో ప్రైవేటు బస్సుల ఓనర్లకు సంక్రాంతి పండగ సందర్భంగా బస్సు ఛార్జీలు అధికంగా పెంపు మరియు వాణిజ్య ఇతర సామగ్రిని రవాణా చేయడం గురించి తదితర వాటిపై ఆర్టీవో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రయాణికుల ద్వారా ఫిర్యాదులు అందుతున్నాయని అధిక ధరలు వసూలు చేయడం తగదన్నారు. ఈ సమా వేశంలో ట్రావెల్స్ వారిని రవాణాశాఖాధికారి సుశీల, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ నారాయణ నాయక్, ఏవో కరీముల్లాలు పాల్గొన్నారు. ఎవరైనా అధికంగా వసూలు చేస్తున్నట్లు సమాచారం ఉంటే 9154294226 నంబరుకు తెలిపాలన్నారు.

# సచివాలయ సిబ్బందికి ఎన్‌జీవో అసోసియేషన్‌లో మెంబర్షిప్

**ప్రొద్దుటూరు క్రైం, జనవరి 9, ప్రభాతవార్త:**

రాష్ట్ర ఎన్‌జీవో అసోసియేషన్ ఆదేశాల మేరకు కమలాపురం సచివాలయం ఉద్యోగులకు మెంబర్షిప్ చేయిస్తున్నామని ప్రెసిడెంట్ నాగలక్ష్మీరెడ్డి, కార్యదర్శి వెంకట రత్నం తెలిపారు. సచివాలయ ఉద్యో గులకు ఏమైనా సమస్యలు వచ్చినప్పుడు తమ సంఘం పోరాటం చేస్తుం దన్నారు. ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న బకాయిలు త్వరలో ఇప్పిస్తామని ఖాళీ గా ఉన్న జాయింట్ సెక్రటరీ పోస్టులను సచివాలయ ఉద్యోగులతో భర్తీ చేస్తామని తెలిపారు.

# గడప గడపకు మన ప్రభుత్వం

**జమ్మలమడుగు, జనవరి 9, ప్రభాతవార్త:**



జమ్మలమడుగు మండలం పరిధిలోని గూడెంచెరువు గ్రామంలో రాజీవ్ నగర్ కాలనీలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో జమ్మల మడుగు ఎమ్మెల్యే డా.మూలె సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గడప గడపలో ఆయనకు స్వాగతం పలికారు. ప్రతి ఇంటిలో ప్రభుత్వ పథకాల ద్వారా ఎంత మేరకు లబ్ది చేకూరుతుందో వివరించారు. కార్యక్రమంలో నాగేశ్వర్‌రెడ్డి, రమణ, ఎంపీటీసీ సభ్యులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా క్రీడా పోటీలు

**కడప క్రైం, జనవరి 9, ప్రభాతవార్త:**



జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు నగరంలోని పోలీసు పరేడ్ మైదానంలో 2వ రోజు మంగళవారం ఉత్సాహంగా ఆటల పోటీలు జరిగాయి. జిల్లాలోని 6 పోలీసు సబ్ డివిజన్ల నుంచి పోలీసులు పాల్గొన్నారు. హాకీ, వాలీబాల్, కబడ్డీ, ఫుట్‌బాల్, బాస్కెట్ బాల్, మహిళలకు కబడ్డీ, ఖోఖో, అథ్లె టిక్స్, విభాగంలో పరుగు పోటీలతో పాటు హైజంప్, లాంగ్‌జంప్, షాట్‌పుట్, డిస్కస్ త్రో, జావెలిన్‌త్రో విభాగాల్లో పోటీలు జరిగాయి. జిల్లా స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌ను ఏఆర్ అదనపు ఎస్పీ కృష్ణారావు, ఏఆర్ డీఎస్పీ రమణయ్య పర్యవేక్షించారు.

# పని చేయని క్వారీలను వర్కింగ్‌లోకి తీసుకు రావాలి

**రాయచోటి.జనవరి 10 ప్రభాతవార్త**



అన్నమయ్య జిల్లాలో పనిచేయని క్వారీలను వచ్చేనెల లోపల వర్కింగ్‌లోకి తీసుకురావాలని కలెక్టర్ గిరీషా పిఎస్ సంబందిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్తానిక కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో మొత్తం 307 క్వారీలు ఉన్నాయన్నారు. ఇందులో 72 క్వారీలు పనిచేయనవి ఉన్నాయని వచ్చే నెల లోపల నాన్ వర్కింగ్ క్వారీలన్ని వర్కింగ్‌లోకి తీసుకురావాలన్నారు. క్వారీలను లీజుకు తీసుకున్న లీజుదారులు బాగా పనిచేయాలనా న్నరు. క్వారీలను సంబంధించి చిన న్న చిన్న సమస్యలు ఉన్నట్లయితే వెంటనే సంబందిత మైన్స్ అధికారులకు తెలియజేసి సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. క్వారీ నిర్వహణకు ముఖ్యంగా ఈసి పర్యావరణ పత్రం, సిఎఫ్ఈ వంటి అనుమతులకు సంబంధించి సమస్యలు ఉంటాయని ఈ సమస్యలు ఉన్నట్లయితే వెంటనే అధికారులకు తెలియజేసి పరిష్కరించుకోవాలన్నారు.

# ఆన్‌లైన్ రుణం తీసుకుని మోసపోవద్దు

**చిన్నమండెం.జనవరి 10 ప్రభాతవార్త**

మండలంలోనే కాకుండా ఏ గ్రామంలోనైనా ఏ నియోజకవర్గంలో నైనా చాలా మంది చదువుకున్న కూడా నిర్లక్ష్యంతోనూ, అమాయకత్వంతోను సమస్యను అంచనా వేయకపోవడం వలన ఆన్‌లైన్‌లో రుణం ఇచ్చేటటువంటి యాప్స్ బారినపడి జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని అలా చేసి బాధలను కొని తెచ్చుకోవద్దని ఎస్ఐ రమేష్‌బాబు పేర్కొన్నారు. సులువుగా సెల్‌ఫోన్ లోనే రుణం వస్తుందని, తరువాత తీర్చుకోవచ్చని రుణం తీసుకుని తిరిగి చెల్లించక రుణం ఇచ్చిన కెంపెనీలు వారు చేసేటటువంటి వేదింపులు భరించలేక చాలా మంది ఇబ్బంది పడుతున్నారన్నారు. వాటి జోలికి పోవద్దని హెచ్చ రించారు.

# ఐక్య పోరాటాలకు సిద్ధంకండి

**బద్వేలు, జనవరి 10 ప్రభాతవార్త :**



ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకై ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం స్థానిక సిఐటియు కార్యాలయం, పాత మున్సిపల్ కార్యాలయం వద్ద సిఐటియు 17వ జాతీయ మహాసభలు విజయవంతం కావాలని కాంక్షిస్తూ సీఐటియు జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సీఐటియు జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ సీఐటియు అఖిల భారత 17వ మహాసభలు ఈ నెల 18 నుండి 22వ తేదీ వరకు కర్ణాటక రాష్ట్ర రాజధాని బెంగుళూరు మహా నగరంలో జరుగు తున్నాయన్నారు. కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు షేక్ ఖాదర్ హుస్సేన్, వృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ నాగరాజు, డివైఎఫ్ఐ జిల్లా అధ్య క్షులు చిన్ని, హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు కొండయ్య, మద్దయ్య, రమణయ్య, ఓబులేసు, బాల గుర్రయ్య, ఫ్రూట్ మర్చంట్ నాయకులు మాబాషా, చిన్నా, గౌస్‌పీర్, ఖలీల్ బాష, మున్సిపల్ యూనియన్ పట్టణ అధ్యక్షులు శ్యామ్ ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి నాగేంద్ర బాబు, కార్యనిర్వాహక అధ్యక్షులు హరి, కోశాధికారి శివకుమార్, ఉపాధ్యక్షులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

## డిఎస్‌పి కార్యాలయ ఆవరణంలో సుందరీకరణ

### చూపరులను ఆకర్షిస్తున్న పార్కు

మదనపల్లె, జనవరి 10 ప్రభాతవార్త :



డిఎస్‌పి ప్రధాన కార్యాలయం ఆవరణంలో పార్కు సుందరీకరణకు నోచుకొంది. ఆవరణంలోని వృక్షాలకు కలర్ వేయడంతో చూపరులను ఆకర్షిస్తున్నాయి. డిఎస్‌పి కేశప్ప కార్యాలయ ఆవరణంలో ఉన్న చెట్లను సుందరీకరణ చేసేందుకు చర్యలు చేపట్టడంతో పార్కుగా దర్శనమిస్తూ పలువురిని ఆకర్షిస్తోంది. ఇన్నాళ్ళు కార్యాలయ ఆవరణంలో గడ్డి, ముళ్ళచెట్లతో ఉన్న చెట్లతో ఉన్న స్థలాన్ని సుందరీకరణం చేయడం పట్ల కార్యాలయ ఆవరణంలోకి వచ్చే ఫిర్యాదు దారులు, వివిద విభాగాలకుచెందిన వారు ముగ్దులవుతున్నారు. డిఎస్‌పి కార్యాలయం కూడా సుందరీకరణకు నోచుకోంటొంది. బ్రిటీష్ కాలంలో నిర్మించిన డిఎస్‌పి భవనం మరమ్మత్తులు చేపట్టేందుకు చర్యలు చేపడుతున్నారు. గతంలో రాష్ట్రం లోనే మదనపల్లె డిఎస్‌పి సర్కిల్ అతి పెద్దదిగా ఉండేది. జిల్లాల పునర్విభజనలో భాగంగా ప్రస్తుతం మదనపల్లె అర్బన్, రూరల్, తంబళ్ళపల్లె నియోజకవర్గాలకే డిఎస్‌పి కార్యాలయం పరిమితం చేశారు. సర్కిల్ పరిధి చిన్నది కావడంతో ప్రజా సమ స్యలు ఎప్పటికప్పుడు పరిష్కారం అవుతున్నాయని డిఎస్‌పి తెలిపారు.

## నవరత్నలతోనే నిరుపేదలు లబ్ది : ఎమ్మెల్యే

మదనపల్లె, జనవరి 10 ప్రభాతవార్త :



నవరత్న పథకాలతోనే నిరుపేదలందరూ లబ్ది పొందుతున్నారని ఎమ్మెల్యే నవాజ్ బాషా తెలిపారు. మంగళవారం పట్టణంలోని 28వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన నవరత్న పథకాల బుక్‌లెట్‌ను గడప గడపకు తీసుకెళ్లి లబ్దిదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వార్డులో నెలకొన్న సమస్యలు అడిగి తెలుసుకొని పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాల మేరకు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. అర్హులైన వారందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు మంజూరు చేస్తామన్నారు. అర్హులుగా ఉండి పథకాలు అందని వారు ఉంటే మళ్ళీ ధరఖాస్తు చేసు కుంటే మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మెన్‌లు జింకా చలపతి, నూర్ అజాం, కౌన్సిలర్లు కరీ ముల్లా, రామిశెట్టి శివయ్య, ఎస్‌వి.రమణ, నాయకులు దండు కరుణాకర్‌రెడ్డి, రహీం, చంద్రశేఖర్‌నాయుడు, సదాశివరెడ్డి పాల్గొన్నారు.

## జాతీయ స్థాయిలో ఆదిత్య విధ్యార్థిని ప్రతిభ

మదనపల్లె, జనవరి 10 ప్రభాతవార్త :



జాతీయస్థాయిలో నిర్వహించిన క్రీడల్లో ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థిని బి.సమిత ప్రతిభ కనపరిచారు. 2022 మార్షల్ ఆర్ట్స్ యూనివర్శిటి ఆఫ్ జమ్మూకాశ్మీర్ నిర్వహించిన చాంఫియన్‌షిప్ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో ప్రతిభ కనపరచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సతీష్‌బాబు తెలిపారు. ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో సిఎస్‌ఈ రెండవ సంవత్సరం చదువుతున్న ఈ విద్యార్థిని ఈ పోటీల్లో ప్రతిభ కనపరచి స్వర్ణపథకం పొందారన్నారు. విద్యార్థి ప్రతిభ పట్ల కళాశాల సెక్రటరీ, ఛైర్మెన్ ఆర్.రామ్మోహన్‌రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి, సిఎస్‌ఈ విభాగ హెచ్‌ఓడి కె.లక్ష్మయ్య, అధ్యక్షులు నాగమల్‌రెడ్డి, విద్యార్థిని తండ్రి పి.రమేష్‌లు అభినందించారు.

## నల్లచట్టాలు రద్దు చేయాలని ధర్నా

మదనపల్లె, జనవరి 10 ప్రభాతవార్త :



చీకటి, నల్లచట్టాల జిఓనెంబర్ 1ను రద్దు చేయాలని సిఐటియు నాయకులు ధర్నా నిర్వహించారు. మంగళవారం నీరుగట్టు వారిపల్లెలోని మార్కెట్‌యార్డు వద్ద సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక వర్గ విముక్తి కోసం పోరాడేందుకు ఎర్ర జెండాననే అన్నారు. అఖిల భారత మహాసభలు జయప్రదం చేయాలని కోరారు. బెంగుళూరులో ఈ నెల 18నుంచి 22వరకు ఈ మహాసభలు జరుగుతాయన్నారు. రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వం కార్మికులను అన్ని విధాలుగా నష్టపరుస్తోందన్నారు. జిఓ నెంబర్ 1ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకురాలు మధురవాణి, జిల్లా కార్యదర్శి పి.రాజేశ్వరి, డి.ప్రభాకర్‌రెడ్డి, గంగాదేవి, సురేంద్ర, సులోచన, రమణమ్మ పాల్గొన్నారు.

## 85మంది పాత నేరస్తులు బైండోవర్

మదనపల్లెక్రైం, జనవరి 10 ప్రభాతవార్త :

పాత నేరస్థులు 85మందిని బైండోవర్ చేసినట్లు రూరల్ సిఐ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడుతూ కొడిపందెం, జూదం, సారా, అక్రమ మద్యం విక్రయాలు చేసిన పాత నేరస్తులను 85మందిని బైండోవర్ చేసి తహశీల్దార్ ఎదుట హాజరు పరిచినట్లు తెలిపారు. బైండోవర్ అయిన వారు మరో సారి ఇలాంటిజూదాలు ఆడితే లక్ష రుపాయలు చొప్పున జరిమానా చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం మహిళ పోలీసులతో సమావేశం నిర్వహించి సంక్రాంతి పర్వదినం సందర్భంగా గ్రామాల్లో ఎక్కడైనా కోడిపందాలు జూదం, మద్యం, విక్రయాలు కొనసాగిస్తుంటే సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐలు చంద్రశేఖర్, సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

## క్షయవ్యాధిగ్రస్తులకు పోషకాహార పదార్థాలు పంపిణీ

మదనపల్లెక్రైం, జనవరి 10 ప్రభాతవార్త :



క్షయవ్యాధిగ్రస్తులకు ప్రధానమంత్రి టీబి ముక్తభారత్ అబియాన్ నిక్షయ్ మిత్ర పథకం కింద పౌష్టికాహారం సాయం అందించడం కోసం భారత ప్రభుత్వ ఆరోగ్య శాఖ 2022 సెప్టెంబర్ 9న ప్రారంభించినట్లు తెలిపారు. 2025నాటికి భారత దేశాన్ని టీబి రహిత దేశంగా ఉంచాలన్నదే దీని ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా కనీసం ఒక్క టిబి రోగిని ఆరునెలల పాటు దత్తత తీసు కొని పౌష్టికా హారపదార్థాలు అందజేయాలని ప్రజలకు పిలుపు నిచ్చారు. మదనపల్లె టిబి యూనిట్‌లో సుమారు 46మంది క్షయ వ్యాధిగ్రస్తులకు దాతలు సహకారంతో పౌష్టికాహారం అందజేసిన వారిని జిల్లా ఆసుపత్రి మెడికల్ సూపరిండెంటెంట్, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, టిబివిభాగం మదనపల్లె సిబ్బంది, దయాలసీస్ ప్రభాకర్, సుశీల, వనజకుమారి, జ్ఞానతిలగం పాల్గొన్నారు.

## కమ్యూనిటి రేడియోపై గెస్టులెక్చర్

కురబలకోట, జనవరి 10 ప్రభాతవార్త:



మండలంలోని మిట్స్ కళాశాలలో మంగళవారం టెక్నికల్ యాక్సస్ ఆఫ్ కమ్యూనిటి రేడియో స్టేషన్‌పై గెస్టులెక్చర్ నిర్వహించారు. ఈసందర్భంగా గెస్టులెక్చర్ బెంగుళూరుకు చెందిన వార్తప్ మీడియా టెక్నాలజీ సంస్థకుచెందిన డైరెక్టర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ కమ్యూనిటీరేడియో వాణిజ్య పబ్లిక్ బ్రాడ్‌కాస్టింగ్‌తో మూడవ మోడల్ రేడియో ప్రసారాన్ని అందిస్తుందన్నారు. కమ్యూనిటి రేడియో స్టేషన్లు యాజమాన్యాల ఆధీనంలో ఉంటాయని వారికి అవసరమైన వారికి ప్రసారాలు అందించడం జరుగుతుందన్నారు. ఇదిసాదారణంగా లాభాపేక్ష లేనివి వ్యక్తుల సమూహాల కమ్యూనిటి సొంత కథనాలు ప్రసారం చేయడానికి అనుభవాలను పంచుకోవడానికి మీడియో ధనిక ప్రపంచంలో, మీడియా సృష్టికర్తలు సహకారాలుగా మారడానికి ఇది యంత్రాంగాన్ని అందిస్తాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ డాక్టర్ సతీష్, ఇంటర్‌నేషనల్ రిలేషన్ సెల్ సీనియర్ మేనేజర్ విజయలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

కడప ఎడ్యుకేషన్, జనవరి 10, ప్రభాతవార్త:



రాయలసీమ విద్యార్థి యువజన సంఘం (ఆర్ఎస్‌వైఎఫ్) మూడో జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కడప నగరంలోని రాష్ట్ర కార్యాలయంలో జిల్లా మహాసభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాయలసీమ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.శంకర్ మాట్లాడుతూ ఈనెల 30, 31 తేదీల్లో 2 రోజుల పాటు జిల్లా మహాసభలను నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు, యువకులు, నిరుద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. మన జిల్లా సమస్యలపైన, రాయలసీమ అభివృద్ధి గురించి చర్చించడం జరుగుతుందన్నారు. జీవో నెంబరు 77 రద్దు చేయాలన్నారు. ఈ సమస్య లన్నింటి పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈ మహాసభలలో భవిష్యత్తు ఎజెండాను రూపొందించడం జరుగుతుందన్నారు. సమావేశంలో నగర అధ్యక్ష, కార్యదర్శులు శివ, సోయల్, నగర సహాయ కార్యదర్శి నాయక్, నగర ఉపాధ్యక్షుడు కార్తీక్ పాల్గొన్నారు.

## మామిడిలో సస్యరక్షణ చర్యలు

లక్కిరెడ్డిపల్లె, జనవరి 10, ప్రభాతవార్త:



మామిడిలో పూత దశలో ఉన్న ద్రవ జీవామృతాలతో సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు పొందవచ్చని ప్రకృతి వ్యవసాయాధికారి కాంతమ్మ పేర్కొన్నారు. మంగళవారం దప్పేపల్లె పంచాయతీలోని కొండవాండ్లపల్లెలో ఏవో సోమశేఖర్‌రెడ్డి 14 ఎకరాల మామిడి తోటకు 25 టన్నుల ఘన జీవామృతం తయారు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఘన ద్రవా మృతం ఒక్కొక్క చెట్టుకు 20 కేజీలు పెడితే మంచి దిగుబడులు పొందవచ్చ న్నారు. ఘన ద్రవ జీవవామృతం మన చుట్టూ ఉన్న ప్రకృతి ఎరువులతో సులభమైన పద్ధతిలో తయారు చేసుకోవచ్చన్నారు. 30 కేజీలు శనగ పిండి, 30 కేజీలు బెల్లం, 300 లీటర్ల నాటు ఆవు మూత్రం 150 కేజీల పేడ పుట్టమన్ను, 200 లీటర్ల డ్రమ్ములలో 3వేల లీటర్ల ద్రవ జీవామృతం తయారు చేసుకో వచ్చన్నారు. ఈ ఘన ద్రవ జీవామృతాల ద్వారా పూత బాగా పెరిగి మంచి ఫలితాన్ని ఇస్తుందన్నారు. రైతులు మామిడి తోటలో ఈ ప్రకృతి వ్యవసాయా లను ఘన ద్రవ జీవామృతం తయారు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎల్ఐఎంఏ సరస్వతి, యూనిట్ ఇన్‌ఛార్జి కె.గంగిరెడ్డి, ఐసీఆర్పీలు మహేంద్ర, లక్ష్మీ ప్రసన్న, రైతులు పాల్గొన్నారు.

## చల్లపల్లి చిరస్మరణీయుడుగా నిలవాలి

తంబళ్లపల్లె, జనవరి 10, ప్రభాతవార్త:



తంబళ్లపల్లె, మదనపల్లె నియోజక వర్గాల్లో తిరుగులేని నాయకుడైన చల్లపల్లి నరసింహారెడ్డి చిరస్మరణీయుడుగా నిలవాలని తంబళ్లపల్లె మండల నాయకులు ఆకాంక్షించారు. మంగళవారం ఆయన స్వగృహంలో జరిగిన చల్లపల్లి నరసింహా రెడ్డి పుట్టిన రోజు వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయ నకు దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చల్లపల్లి నరసింహారెడ్డి మాట్లాడుతూ నా పుట్టిన రోజు వేడుకలు తంబళ్లపల్లె, మదనపల్లె నియోజకవర్గాల్లోని ప్రతి అభిమాని, అన్ని వర్గాల ప్రజలు అంకితమని భావోద్వేగంతో చెప్పారు. కార్యక్రమంలో తంబళ్లపల్లె మండల నాయకులు ముద్దలదొడ్డి శంకర్‌రెడ్డి, చౌడ సముద్రం దేవా, గొల్లపల్లిమోహన్, రామస్వామిరెడ్డి, రాఘవరెడ్డి, భాస్కర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ రంగంలో ఉక్కు పరిశ్రమ నిర్మించాలి

జమ్మలమడుగు, జనవరి 10, ప్రభాతవార్త:



కేంద్ర ప్రభుత్వం విభజన హామీలలో భాగంగా కడప ఉక్కు పరిశ్రమ ప్రభుత్వ రంగంలో నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రభుత్వ రంగంలోనే కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని మంగళవారం ఉక్కు సాధన ఐక్యవేదిక ఆధ్వర్యంలో జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో శ్రీనివాసులుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జమ్మలమడుగు కార్యదర్శి వీరనాల శివనారాయణ, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, సీఐ టీయూ నాయకులు మన్సూర్, ఆవాజ్ బాషా, ఎస్ఎఫ్ఐ నాయకులు ఇమాంలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి తీవ్ర న్యాయం చేసిందన్నారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్రాన్ని నిలదీయలేక సొంతంగా ప్రభుత్వమే ఉక్కు పరిశ్రమ నిర్మిస్తామని చెప్పి 4 సంవత్సరాల తరువాత ప్రైవేటు భాగస్వామ్యంతో కలిసి జేఎస్‌డబ్ల్యూతో కడప ఉక్కును నిర్మిస్తామని చెబుతున్నదన్నారు. కడప ఉక్కును స్వాగతిస్తున్నామని కానీ ప్రభుత్వ రంగంలో అయితే ఎక్కువ మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయ న్నారు. కడప ఉక్కుకు నిధులు రాబట్టి ప్రభుత్వ రంగంలో ఏర్పాటుకు కృషి చేయాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు సాయి, సీపీఎం కృష్ణ, బాషా పాల్గొన్నారు.

## చౌడమ్మతల్లి ఆలయంలో పూజలు

జమ్మలమడుగు, జనవరి 10, ప్రభాతవార్త:



జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధి లోని శ్రీచౌడమ్మ తల్లి దేవస్థానాన్ని మంగళవారం తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి దేవగుడి భూపేష్‌రెడ్డి దర్శించుకున్నారు. మైసూర్ పీఠాధిపతులు, శ్రీగణపతి సచ్చిదానంద స్వామి వారి ఆశీర్వాదంను ఆయన తీసుకున్నారు. అనంతరం చౌడమ్మ తల్లిని దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు చేయడం జరిగింది. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

## వృక్షపెంపకంపై డ్వామా పీడీ ఆరా

పెద్దమండ్యం జనవరి 10 ప్రభాతవార్త



అటవీ గిరిజనప్రాంతమైన గుర్రంవాండ్ల పల్లె పంచాయితీ గుట్టకింద పల్లె పరిసరాల్లో వృక్ష పెంపకం సహాయ సహకార సంఘందారులతో అన్నమయ్య జిల్లా డ్వామా పథక సంచాలకులు శ్రీమద్దిలేటి, ఎపిడి నంద కుమార్ రెడ్డి సమావేశం నిర్వహించారు. 30సంవత్సరాలుగా అటవీ సంపదను కాపా డుతూ తీసుకున్న జాగ్రత్తలు అభినందనీయమన్నారు. బంజరుభూముల్లో ఉపాది హామీ పథకంద్వారా జరిగినపనులు అగ్నిప్రమాదాల ద్వారా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. రైతులు భూములపై శ్రద్దపెట్టి సాగుచేస్తే చెట్లు అడవులుగా మారి మంచి ఫలితాన్ని ఇస్తాయన్నారు. కార్యక్రమంలో ఎపివో మురళి, ఎఫ్ఈఎస్ టీంలీడర్ భక్తర్‌వల్లి ఏరియాకోఆర్డినేటర్ రమేష్ సిబ్బంది పాల్గొన్నారు.

## మోడల్ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన ఆర్‌జేడీ

పెద్దమండ్యం జనవరి 10 ప్రభాతవార్త



పెద్దమండ్యంలోని మోడల్ స్కూల్‌ను మంగళవారం ఆర్‌జెడీ వెంకట క్రిష్ణారెడ్డి అకస్మికతనిఖీ చేశారు. పాఠశాలలోని నాడునేడుకిందచేపట్టిన పనులు వివరాలు వాటర్‌ప్లాంట , స్టెమ్ పరికరాలు విధివిధానం, ల్యాబ, లైబ్రరీ సమావేశ మందిరంను పరిశీలిచారు. అనంతరం పిల్లలతో ముచ్చటించారు.ఎ గ్రేడ్ ఎంత మందికి వస్తోందని ప్రశ్నించారు. 10సంవత్సరాలు చదవడం ఒకెత్తైతే ఈ మూడు నెలలు చదవడం ఒకెత్తని అందరూ బాగాచదివి మంచి ఉత్తీర్ణత సాధించాలని కోరారు. అనంతరం పాఠశాల ఆధ్యాపకులతో సమావేశం నిర్వహించి విద్యార్థుల చదువు వ్రాసిన పరీక్షలపై వివరాలు అడిగారు. ఎస్ఎ1 పరీక్ష జరిగి రెండు రోజులైనా పేపర్లుదిద్ది ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. పరీక్షల్లో వారి తప్పులను వివిరించి పునరావృతంకాకుండా చూడాలన్నారు. ఉత్తీర్ణతశాతం పెంచా లని సూచించారు. కార్యక్రమంలో డివైఈవో క్రిష్ణప్ప, ఎపిఒబాలాజి, ఎంఈవో మనోహార్, ప్రిన్సిపాల్ రామాంజులునాయక్, పాఠశాల ఉపాద్యాయులు పాల్గొన్నారు.

## రాయలసీమ ద్రోహులు జగన్, చంద్రబాబు : తులసిరెడ్డి

కడప ఏడురోడ్లు, జనవరి 10, ప్రభాతవార్త:



ప్రస్తుత సీఎం జగన్ పూర్వ సీఎం చంద్రబాబు నాయుడు ఇద్దరూ రాయలసీమ ద్రోహులని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా ఛైర్మన్ నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. కడప జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లా డుతూ విభజన చట్టంలో స్పష్టంగా పేర్కొన్న రాయలసీమకు ఉత్తరాంధ్రకు బుందేల్ఖండ్ తరహా ప్యాకేజీ తీసుకురాలేకపోయారన్నారు. తెలంగాణ కృష్ణా నదిపై అక్రమ ప్రాజెక్టులు పాలమూరు రంగారెడ్డి, దిండి ఎత్తిపోతల పథకాలను ప్రారంభిస్తుంటే వీరిద్దరూ చూస్తూ ఊరుకున్నారన్నారు. అవి పూర్తయితే శ్రీశైలం లో చుక్కనీరు రాదని, రాయలసీమ ఎడారి అవుతుందన్నారు. వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లు బిగించడం రైతుల మెడలకు ఉరి తాడు బిగించడమే అన్నారు. జిల్లా అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు మాట్లాడుతూ 11వ తేదీ కాంగ్రెస్ రాష్ట్ర అధ్య క్షులు గిడుగు రుద్రరాజు కడపకు వస్తున్నారని వారితో పాటుగా ఏఐసీసీ సెక్రటరీ సీడీ మేయప్పన్, పీసీసీ రాష్ట్ర మీడియా ఛైర్మన్ డా.నర్రెడ్డి తులసిరెడ్డి, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ గౌతం, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు నాగమధు యాదవ్ పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు విష్ణుప్రీతంరెడ్డి, శ్రీ రాము లు, రాష్ట్ర నేతలు నజీర్‌అహ్మద్, సత్తార్, చార్లెస్, భాస్కర్, నాగరాజు, అలీ ఖాన్, ఆరీఫుల్లా, జిల్లా మహిళా అధ్యక్షురాలు ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోర్ల శ్రీనివాసులు, శ్యామలాదేవి, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్‌గౌడ్, బాబు, చంద్రశేఖర్‌రెడ్డి, ఆనంద్, వేణుగోపాల్, మనోహర్‌బాబు, చంద్ర పాల్గొన్నారు.

## బెస్ట్ బౌలర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా సుదర్శన్‌రెడ్డి

### తృతీయ స్థానం సాధించిన కడప జట్టు

కడప ఏడురోడ్లు, జనవరి 10, ప్రభాతవార్త:



కడప ఆపరేషన్ ఎస్పీడీసీఎల్ వర్సెస్ విజయవాడ ఆపరేషన్ సర్కిల్‌తో మ్యాచ్ మంగళవారం జరిగింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి మొదట ఫీల్డింగ్ ఎంచుకున్న కడప ఆపరేషన్ ఎస్పీడీసీఎల్ ఆటగాడు సుదర్శన్‌రెడ్డి 4 ఓవర్లను వేసి 19 పరుగులు ఇచ్చి 5 వికెట్లు తీసు కున్నాడు. శ్రీధర్ 4 ఓవర్లు వేసి 15 పరుగులు ఇచ్చి 2 వికెట్లు, నరేంద్రారెడ్డి 2.2 ఓవర్లకు 11 పరుగులు ఇచ్చి ఒక వికెట్ పడగొట్టారు. అనంతరం బ్యాటింగ్ చేసిన కడప జట్టు నిర్ణీత ఓవర్లలో మహమ్మద్ అలీ 13 బంతుల్లో 21 పరుగులు, వేణుగోపాల్ 11 బంతుల్లో 24 పరుగులు చేసి విజయాన్నందించినట్లు మేనేజర్ నాగమల్లయ్య హుసేన్ తెలిపారు. ఇంటర్ సర్కిల్ క్రికెట్ టోర్నమెంట్‌లో తృతీయ స్థానాన్ని సాధించారని తెలిపారు. టోర్నమెంట్‌కు స్టేట్‌లోనే కడపకు చెందిన సీనియర్ ప్లేయర్ సుదర్శన్‌రెడ్డి బెస్ట్‌బౌలర్‌గా, అలీ బెస్ట్ బ్యాటర్‌గా, నరేంద్ర బెస్ట్ ఆల్‌రౌండర్‌గా, బెస్ట్ కీపర్‌గా శ్రీకాంత్ నిలిచారు.

## ఉజ్వల హోం, వన్‌స్టాప్ సెంటర్లను తనిఖీ చేసిన జడ్జీ కవిత

కడప ఏడురోడ్లు, జనవరి 10, ప్రభాతవార్త:



ఓం శాంతినగర్‌లో ఉన్న ఉజ్వల హోం, రిమ్స్ ఆవరణలో ఉన్న వన్ స్టాప్ సెంటర్‌ను మంగళవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ సీనియర్ సివిల్ జడ్జీ ఎస్.కవిత తనిఖీ చేశారు. అనంతరం ఆమె న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆపదలో ఉన్న మహిళలకు ఆపన్న హస్తం వన్‌స్టాప్ సెంటర్ (సఖీ) ఒకే చోట అనేక సేవలు, వన్‌స్టాఫ్ సెంటర్‌లో అత్యవసర స్పందన, చట్టపరమైన సలహాలు, పోలీసు సహాయం, మానసిక సలహాలు, వైద్య సహాయం, తాత్కాలిక ఆశ్రయం లాంటి సేవలు ఉంటాయన్నారు. చట్టాల గురించి వివరించి న్యాయ సహాయం ఎలా పొందాలో వివరించారు. మహిళలు 181 ఉమెన్ హెల్ప్ లైన్, 1098 చైల్డ్ హెల్ప్‌లైన్, 100 పోలీస్ హెల్ప్ లైన్ టోల్‌ఫ్రీ నెంబర్లపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉజ్వల హోం స్వధార్ గృహ నిర్వాహకురాలు మూలే సరస్వతి, వన్‌స్టాఫ్ సెంటర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అశ్విని, గంగా ప్లాస్టిక్ ప్రతినిధులు సునీల్‌కుమార్, తిరుపతయ్య పాల్గొన్నారు.

## మండల అభివృద్ధికి సహకరించాలి

### – జిల్లా పరిషత్ వైస్ ఛైర్మన్ బాలయ్య, ఎంపీపీ వరలక్ష్మి

పెండ్లిమర్రి, జనవరి 10, ప్రభాతవార్త:



మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశంను ఎంపీడీవో అల్తాఫ్ హుసేన్ నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీపీ వరలక్ష్మి, జిల్లా పరిషత్ వైస్ ఛైర్మన్ బాలయ్య మాట్లాడుతూ మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో పారిశుద్ధ్యం వంటి సమస్యలు ఎప్పటి కప్పుడు పరిష్కరించాలని తెలిపారు. జగనన్న కాలనీల గృహాలను త్వరగా నిర్మిం చుకొనేలా లబ్ధిదారులకు చూసించాలన్నారు. గ్రామాల్లో ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొ న్నారు. మండల స్థాయి అధికారులు తమ దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు నాగేంద్రరెడ్డి, తహసీల్దార్ ఉదయ్ భాస్కర్‌రాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు, మండల కన్వీనర్ చంద్రారెడ్డి పాల్గొన్నారు.

## ప్రశ్నిస్తే క్రమశిక్షణ పేరుతో తొలగిస్తారా..

కడప ఎడ్యుకేషన్, జనవరి 10, ప్రభాతవార్త:

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంపికలో జరిగిన అసంబద్దాలను ప్రశ్నిస్తే క్రమశిక్షణ పేరుతో తొలగిస్తారా అని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీవీ ప్రసాద్ ప్రశ్నించారు. రాష్ట్ర ఏపీటీఎఫ్ శాఖ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థిని ఎంపిక చేయడంలో చేసిన అసంబద్దాలను ప్రశ్నించిన తనను రాష్ట్ర శాఖ కక్ష కట్టి తొలగిస్తున్నట్లు ప్రకటించడం అన్యాయమని అప్రజాస్వామికమని ప్రసాద్ ఆరోపించారు. జిల్లా కౌన్సిలర్లతో ఎన్నుకొన్న నన్ను తొలగించే అధికారం రాష్ట్ర శాఖకు లేదని అవసరమైతే అవిశ్వాస తీర్మానంతో జిల్లా కౌన్సిలర్లచే నన్ను తొలగించే హక్కు ఉంటుందని ఈ సందర్భంగా తెలిపారు. కమిటీ నిర్ణయం మేరకే నేను ప్రదాన కార్యదర్శిగా కొనసాగుతున్నానని పేర్కొన్నారు. రాష్ట్ర శాఖ అప్రజాస్వామిక విధానాన్ని హైకోర్టులో కూడా కేసు వేశామని తెలిపారు.

## దివ్యాంగులకు చేయూతనిస్తున్న అధికారులు

కడప ఎడ్యుకేషన్, జనవరి 10, ప్రభాతవార్త:



దివ్యాంగుల ఉన్నతికి ప్రత్యేక శ్రద్ధ పెట్టిన జిల్లా యంత్రాంగం మంగళవారం కొత్త కలెక్టరేట్ ఆవరణలోని సభా భవనం ముందు కొంత మంది దారిన పోతున్న దివ్యాంగులను గుర్తించి వారికి చేయూత నిచ్చే విధంగా జిల్లా అధికారులు విభిన్న ప్రతిభావంతుల శాఖ వారి సహకారంతో వారికి ఊతకర్రలు అందజేశారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 10వేల మందికి వివిధ రకాల దివ్యాంగులను గుర్తించి ఆలింకో కంపెనీ సహకారంతో మెడికల్ అసెస్మెంట్ క్యాంప్‌లు నిర్వహించి మరి కొద్ది రోజుల్లో వారందరికీ అవసరమైన కృత్రిమ అవయవాలు, వీల్‌ఛైర్లు, ట్రై సైకిళ్లు, రోలాటర్స్ స్టిక్స్, వినికిడి యంత్రాలు మొదలగు పరికరాలు ఇవ్వడానికి జిల్లా యంత్రాంగం ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ పంపిణీ కార్యక్రమంలో జిల్లా అధికారులు జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ యధుభూషణ్‌రెడ్డి, వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ నాగేశ్వరరావు, జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి డా.అంబవరం ప్రభాకర్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా.హెచ్.వెంకట సుబ్బయ్య, విభిన్న ప్రతిభా వంతుల సంక్షేమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కృష్ణ కిశోర్, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ నరసింహారెడ్డి, మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేత్రదానం

ప్రొద్దుటూరు అర్బన్ జనవరి 10, ప్రభాతవార్త



జమ్మలమడుగు రోడ్డులో నివసిస్తున్న 82 సంత్సరాల వరికూటి నాగిరెడ్డి మంగ్లవారం మృతి చెందగా వారి సమీప బంధువు డాక్టర్ రాజా రామ్మో హన్ రెడ్డి వెళ్లి బార్య ఇందిరా దేవి,కుమారులు నరేంద్ర మోహన్ రెడ్డి, శివశంకర్ రెడ్డిను సంప్రదించి నేత్ర దానం చేయమని అడగగా వారు అంగీకరిం చారు. డాక్టర్ వైవి లక్ష్మీదేవి ఐ బ్యాంకుకు విషయము తెలియ చేయగా సిబ్బంది అక్కడకు చేరుకొని మృతదేహం నుండి 2 కార్నియాలను సేకరించారు. నేత్ర దానం మరణానంతరం 6గంటలలోపు చేయాలి. ఒక్కరు నేత్రదానం చేస్తే ఇద్దరు అంధులకు చూపు ప్రసాదించవచ్చు. నేత్ర దానం చేయ దలచిన వారు 9885339306కు కాల్ చేయండి.

## నవరత్నాల పేరుతో నిధుల మళ్లింపు తగదు

ప్రొద్దుటూరు జనవరి 10, ప్రభాతవార్త



రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాల పేరుతో బీసీ ఎస్సీ ఎస్టీ కార్పొరేషన్ నిధులను దారి మళ్లించి దోచేసిన ద్రోహి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అని టిడిపి బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సుంకర వేణుగోపాల్ విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం పత్రికలకు ప్రకటన విడుదల చేశారు. రాజ్యాంగబద్ధంగా రావలసిన బడుగు బలహీన వర్గాలకు స్వయం ఉపాధి ఆర్థిక అభివృద్ధి చెందాలని గత ప్రభుత్వాలు బీసీ ఎస్సీ ఎస్టీల కార్పొరేషన్లు ఏర్పాటు చేసి వాటి ద్వారా ఎంతో మంది ఆర్థికంగా అభివృద్ధి చెంది సమాజంలో గుర్తింపు పొందిన వారు చాలామంది ఉన్నారు అన్నారు కానీ ప్రస్తుత ముఖ్యమంత్రి వైయస్ జగన్మో హన్ రెడ్డి నవరత్నాల పేరు చెప్పి బడుగు బలహీన వర్గాల నిధులను లక్షలకు లక్షలు అగ్రకులాలైన తన సలహాదారులకు కట్టబెట్టి అణగారిన కులాలను అణగ దొక్కే ప్రయత్నం చేయడం బాధాకరమన్నారు ఉపాధి పనులు లేకపోవడం నిత్యావ సర ధరలు విపరీతంగా పెంచేసి సామాన్యుని మీద అధిక భారం మోపడం దుర్మా ర్గమన్నారు రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని మాయమాటలు చెప్పి అధికారం చేపట్టిన జగన్ నిరుద్యోగ యువతను పెంచుతూ పోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం అన్నా రు వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఓటు అడిగే హక్కు ఈ ప్రభుత్వానికి లేదని ప్రతి ఒక్కరు ఏకమై ఈ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రక టన విడుదల చేసిన వారిలో టిడిపి కడప పార్లమెంటరీ ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి నాసారి లక్ష్మీనరసింహా ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి మలిగేలి మల్లికార్జున దేవాంగ సాధికారిక కమిటీ రాష్ట్ర కార్యదర్శి అంపావతిన నాగ సుబ్బరాయుడు నందమూరి యువసేవ సమితి అధ్యక్షుడు గోమేదికం సుదర్శన్ ఉన్నారు.

## కృష్ణానది యాజమాన్య బోర్డును రాయలసీమలోనే ఏర్పాటు చేయాలి

### – ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి డిమాండ్

కడప వైద్యవిభాగం, జనవరి 10, ప్రభాతవార్త:



కృష్ణానది యాజమాన్య బోర్డును విశాఖపట్నంలో పెట్టాలని వైసీపీ ప్రభుత్వం చూస్తోందని, కృష్ణానది ప్రవహించేది రాయలసీమలో అయితే దానికి సంబంధించిన యాజమాన్య బోర్డును విశాఖలో ఎలా ఏర్పాటు చేస్తారని రాయల సీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి ప్రశ్నించారు. కృష్ణానది యాజమాన్య బోరఢును రాయలసీమలోనే ఏర్పాటు చేయాలని కడప కోటిరెడ్డి సర్కిల్ నందు రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ కృష్ణా నది ప్రవహించే ప్రాంతాలలో కాకుండా కృష్ణానదికి ఏమాత్రం సంబంధం లేని విశాఖలో బోర్డును ఏర్పాటు చేయడం అంటే రాయలసీమ ప్రజలను అవమానించడమేనన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌వైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శంకర్, ఆర్‌సీపీ నగర కార్యదర్శి మగ్బుల్ బాషా, నగర కార్యదర్శి వర్గ సభ్యులు చాపల సుబ్బరాయుడు, లక్ష్మీ దేవి, ప్రసాద్, రమేష్, రైతు నాయకులు ప్రతాప్‌రెడ్డి, మునిరెడ్డి, డీజీహెచ్‌పీఎస్ జిల్లా గౌరవాధ్యక్షులు వెంకటేష్, నాయకులు రవి, విజయ్, శంకరయ్య పాల్గొన్నారు.

## క్యాలెండర్ ఆవిష్కరించిన అమీర్‌బాబు

కడప వైద్యవిభాగం, జనవరి 10, ప్రభాతవార్త:



రాయల్ కరీం సేవా సమితి వారు తయారు చేసిన 2023 సంవత్సరం క్యాలెండర్‌ను మంగళవారం రహ్మత్ ఫంక్షన్ హాలు నందు తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి వీఎస్.అమీర్‌బాబు చేతుల మీదుగా విడుదల చేశారు. ఎంతో ఆకర్షణతో తయారు చేసిన 2023 సంవత్సరం క్యాలెండర్‌ను ప్రతి ఒక్కరికి అందేలా ఆర్‌కే సేవా సమితి నాయకులు అబ్దుల్ రాయల్ కరీముల్లాను కోరారు. కార్యక్రమంలో తెదేపా జిల్లా డాక్టర్స్ సెల్ అధ్యక్షులు సయ్యద్ సలీంబాషా, అల్లాబకాష్, బాబు పాల్గొన్నారు.

## జీవో నెం.1ని భేషరతుగా రద్దు చేయాలి

కడప వైద్యవిభాగం, జనవరి 10, ప్రభాతవార్త:




కడప సీఐటీయూ నగర కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పాత బస్టాండు వద్ద ధర్నా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమా నికి నగర అధ్యక్షుడు పి.చంద్రారెడ్డి అధ్యక్షత వహిస్తూ ధర్నా కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీని వాసులురెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. భావ ప్రకటన అప్రజాస్వామిక మైన జీవో నెంబరు-1ని భేషరతుగా రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యలను, ఉద్యోగుల, కార్మికుల, నిరుద్యోగుల సమ స్యలను నిర్లక్ష్యం చేస్తూ వాటి గురించి మాట్లాడిన ర్యాలీలు, సభలు నిర్వహించి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తూ పోలీసు రాజ్యంగా చేయాలని చూస్తున్న సీఎం జగన్ నియంతృత్వ వైఖరి మానుకోవాలని డిమాండ్ చేశారు. కార్య క్రమంలో జిల్లా, నగర ప్రధాన కార్యదర్శులు బి.మనోహర్, వెంకటసుబ్బయ్య, సీఐటీయూ నాయకులు గోపీ, కేశవ, ఇమాం, మౌలా, ప్రభాకర్, మాబూతార, ఆటోరెడ్డి, నాగరాజు, పవన్, మస్తాన్ పాల్గొన్నారు.

## ఇస్లామీయ ధర్మ అవగాహన సదస్సు

కడప ఏడురోడ్లు, జనవరి 10, ప్రభాతవార్త:



ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ సహకారంతో ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు పర్యవేక్షణలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు స్థానిక అల్మాస్ కల్యాణ మండపంలో ఒక రోజు పరిషత్ ఇస్లామీయా ధర్మావగాహన వర్క్‌షాప్ జరిగింది. కార్యక్రమంలో 900 మందికి పైగా మహిళలు పాల్గొన్నారు. మౌలానా ఖాలిద్ సైపుల్లా రహ్మానీ జనరల్ సెక్రటరీ ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్‌లా పర్యవేక్షణలో జనాబ్ ఇస్తాక్ అలీ మెంబర్ ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్‌లా అధ్యక్షతన ఇతర స్థానిక పండితులు ప్రముఖుల మద్దతుతో చారిత్రాత్మక, విజయవంతమైన సమావేశం జరిగింది. షరియత్ అవగాహన కమిటీ నలుగురు బాధ్యులైన మహిళలు డా.జలీసా సుల్తానా, యాసిన్ అడ్వకేట్, డాక్టర్ ఖుద్సాస సుల్తానా, డాక్టర్ జోహార్ జహాన్ ముఫీజా హఫీజ్ సాహిబా హైదరాబాదు నుంచి వచ్చి ముస్లిం సమాజానికి సంబంధించిన ముఖ్యమైన అంశాలపై ప్రసంగించారు.

## ఐదు మంది పేకాట రాయుళ్ల అరెస్టు

కొండాపురం, జనవరి 10, ప్రభాతవార్త :

కొండాపురం మండలంలోని దొంకపల్లె ఆశ్రమం సమీపంలో పేకాట ఆడుతున్న ఐదు మందిని అరెస్టుచేసినట్లు ఏఎస్సై ఉత్తమ్‌రెడ్డి తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు పేకాట ఆడుతున్న వారిని అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ.26500 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు.

## నగర పంచాయతీ కార్యాలయ తరలింపును నిరసిస్తూ టీడీపీ నిరసన

– చైర్మన్, వైస్ చైర్మన్ కౌన్సిలర్లు తక్షణమే రాజీనామా చేయాలి

కమలాపురం, జనవరి 10, ప్రభాతవార్త:



కమలాపురం నగర పంచాయతీ కార్యాలయాన్ని స్థానిక ఎంపీడీవో కార్యాలయ సముదాయానికి తరలించే ఆలోచనను మానుకోవాలంటూ తెదేపా ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. మంగళవారం తెదేపా జిల్లా ఉపాధ్యక్షులు అంకిరెడ్డి, జిల్లా మైనార్టీ అధ్యక్షులు ఖాదర్‌బాషా, జిల్లా తెలుగు యువత మాజీ అధ్యక్షులు దివాకర్‌రెడ్డి, రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, మాజీ మండల కోఆప్షన్ కుచ్చుపాప అన్వర్ బాషా, మాజీ ఆసుపత్రి చైర్మన్ జంపాల నరసింహారెడ్డి, తెలుగు యువత అధ్యక్షులు పుత్తా ఎల్లారెడ్డిల ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, ప్రజలు కలిసి స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద రోడ్డుపై బైఠాయించి ననిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యే, కౌన్సిలర్లు, ఛైర్మన్లు డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పట్టణ ప్రజలకు సౌకర్యవంతంగా లేని చోటికి నగర పంచాయతీ కార్యాలయం తరలింపుపై ఎటువంటి అభ్యంతరాలు తెలపకుండా ఉన్న నగర పంచాయతీ ఛైర్మన్, వైసీపీ, కౌన్సిలర్లు తక్షణమే రాజనామా చేయాలని డిమాండ్ చేశారు. నగర పంచాయతీ ప్రజల వ్యతిరేకతను గమనించి ఇప్పటికైనా కమలాపురం ఎమ్మెల్యే నగర పంచాయతీ కార్యాలయంగా మారిస్తే ప్రజలందరికీ ఆమోదయోగ్యకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా తెదేపా నాయకులు పల్లె రామసుబ్బారెడ్డి, విభరాపురం రాఘవరెడ్డి, సుబ్బారెడ్డి, కౌన్సిలర్‌లు బాబుల్, రఫీ, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు పుల్లగూర శ్రీనివాసులు, ఐటీడీపీ జిల్లా అధ్యక్షులు నరసింహ, మండల ఐటీడీపీ అబ్దుల్ నబీ, కార్యకర్తలు చెన్నకృష్ణారెడ్డి, శ్రీకాంత్, రాయల్ శ్రీను, భాగ్యలక్ష్మి, గంగరాజు, ప్రవీణ్, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే

కమలాపురం, జనవరి 10, ప్రభాతవార్త:



వల్లూరు మండలం సి.కొత్తపల్లె, లింగాయపల్లె గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అధికారులో కలిసి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పతకాల గురించి వివరిస్తూ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ యంత్రాంగమంతా మీ ఇంటి వద్దకే వచ్చిందని మీ సమస్యలు ఏమైనా ఉంటే మా దృష్టికి తెస్తే పరిష్కరిస్తామన్నారు. పలు సమస్యలను ప్రజలు దృష్టికి తీసుకురావడంతో ఆయన వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో నారాయణరెడ్డి, ఎంపీడీవో జుబేదా, ఎంఈవో గొర్రె లిల్లెమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, హౌసింగ్ ఏఈ ప్రతాప్‌రెడ్డి, ఏపీఎం శైలజ, పంచాయతీ రాజ్ ఏఈ పవన్‌కుమార్, గ్రామ సచివాలయ సిబ్బంది, మండల కన్వీనర్ వీరారెడ్డి, లోకేశ్వరరెడ్డి, గంగమ్మ, రామకృష్ణారెడ్డి, నారాయణరెడ్డి, గుర్రంపాటి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఆర్‌పీఎస్ఆర్ క్రీడాకారుల ఎంపిక

పులివెందుల, జనవరి 10, ప్రభాతవార్త :



రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు వేంపల్లెలోని ఆర్‌పిఎస్ఆర్ క్రికెట్ అకాడమీకి చెందిన పి.కాత్యాయని, పి.బాలాజి, క్రిష్ణ, అహమ్మద్ ఖీఆర్ మన్సూరీ, ఎం.అక్షిత్‌రెడ్డి (యు14) అనే ఐదుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. పుల్లంపేటలోని ఎస్‌జీఎఫ్ఐ అండర్–19 క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొని ప్రతిభ చూపారు. ఈనెల 11 నుండి 13వరకు మచిలీపట్నంలో జరగబోయే అండర్–19 ఎస్‌జీఎఫ్ఐ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. వీరి ఎంపిక పట్ల ఆర్‌పీఎస్ఆర్ క్రికెట్ అకాడమీ చైర్మన్ రామిరెడ్డి, విశ్వనాథరెడ్డి, ట్రెజరర్ మాధవరెడ్డి, కోచ్ షరీఫ్ పఠాన్, పీఆర్ఎల్ బస్ యజమాని ప్రభాకర్‌రెడ్డిలు హర్షం వ్యక్తం చేశారు.

## చార్టర్డ్ అకౌంట్స్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని

బద్వేలు, జనవరి 10 ప్రభాతవార్త :



చార్టర్డ్ అకౌంట్స్ పరీక్షల్లో కాకర్ల స్రవంతి అనే విద్యార్థిని అత్యధిక మార్కులు సాధించి విజేతగా నిలిచారు. 5 సంవత్సరాల విద్యాబోధనలో జిల్లాలోనే బద్వేలు మండలం కొంగలవీడు గ్రామానికి చెందిన కాకర్ల స్రవంతి చార్టర్డ్ అకౌంట్స్ పరీక్షల్లో ప్రతిభ కనపరచడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ డి.సి.గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డా॥ సుధ విద్యార్థిని స్రవంతిని అభినందనలు తెలియజేసినట్లు స్రవంతి తెలిపారు. పట్టుదలతో చదివి చార్టర్డ్ అకౌంట్స్‌లో అత్యుత్తమ ఫలితాలు సాధించడం గొప్ప విషయమన్నారు. స్రవంతిని కళాశాల యాజమాన్యం అభినందించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## కస్తూర్బాను తనిఖీ చేసిన జీసీటీవో ధనలక్ష్మి

దువ్వూరు, జనవరి 10, ప్రభాతవార్త:



ఈ ఏడాది పదో తరగతి చదువుతున్న విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని జీసీటీవో ధనలక్ష్మి అన్నారు. మంగళవారం పుల్లారెడ్డిపేటలోని కస్తూర్బా బాలికా విద్యాలయాన్ని తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షలు బాగా రాసి ఉత్తీర్ణత సాధించాలన్నారు. అలాగే మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులకు జరుగుతున్న పరీక్షలు తనిఖీ చేశారు. ఎస్‌ఏ-1, ఎస్‌ఏ-2 పరీక్షల్లో మార్కులు పరిశీలించి ప్రగతిపై చర్చించారు. 8వ తరగతి విద్యార్థులకు అందించిన ట్యాబ్‌లో మైజ్యూస్ యాప్ గురించి వివరించారు. అనంతరం ఉపాధ్యాయ బృందానికి పలు సూచనలు చేశారు. క్రమశిక్షణతో విద్యార్థులను చదివించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో రామాంజనేయులు, కస్తూర్బా ప్రత్యేక అధికారి మల్లేశ్వరి పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

– వైసీపీ యువజన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముక్కా సాయివికాస్‌రెడ్డి

ఓబులవారిపల్లె, జనవరి 10, ప్రభాతవార్త:



సమాజంలో ఉన్న విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించి ప్రతిభ కనబరచాలని రాష్ట్ర వైసీపీ యువజన ప్రధాన కార్యదర్శి, ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ సృష్టి కర్త సాయివికాస్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మంగంపేట బైపాస్ వద్ద ఉన్న విశాలమైన ఖాళీ ప్రదేశంలో క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండగ కానుకగా ఈ క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతితో పాటు ప్రోత్సాహక బహుమతులుంటాయన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు భరత్‌కుమార్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచ్ శ్రీధర్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో వైభవంగా సంక్రాంతి రంగవల్లి పోటీలు

రాయచోటి.జనవరి 10 ప్రభాతవార్త



అన్నమయ్య జిల్లా పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో మంగళవారం సంక్రాంతి పండుగ సందర్భంగా పోలీస్ కుటుంబాలు మహిళలతో రంగవల్లీ పోటీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాలమేరకు ఆయన సతీమణి శ్రీమతి వి.శృతి ఆద్వర్యంలో పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిధిగా జిల్లా కలెక్టర్ సతీమణి శ్రీమతి స్నేహ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలలో ఉన్న వికాసం ఉత్తేజం నైపుణ్యం రంగవల్లుల ద్వారా బయటపడుతుందన్నారు. ఎప్పుడూ పని ఒత్తిడితో ఉన్న మహిళలకు ఈ పోటీలు వారికి ఉత్సాహాన్ని వినోదాన్ని ఇస్తాయన్నారు. ఈ రంగవల్లులో ముత్యాల గొబ్బెమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయని ఇప్పటి తరం వారికి భావితరాల వారికి హరిదాసులు గంగిరెద్దులు, బోగిమంటలు తెలియకుండా పోతున్నాయన్నారు. జిల్లా ప్రజలు సంక్రాంతి పండుగను కుటుంబ సభ్యులతో ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని వారు కోరారు. రంగవల్లుల విజేతలకు కలెక్టర్ సతీమణి స్నేహ, ఎస్పీ సతీమణి శృతి, డిఎస్పీ సతీమణి మరియు ఎస్సీ, ఎస్టీ సెల్ డిఎస్పీ సతీమణి చేతులు మీదుగా బహుమతులు అందజేశారు.

## రాష్ట్రం అభివృద్ధి జరగాలంటే టిడిపి అధికారంలోకి రావాలి

–మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి

రాయచోటి.జనవరి 10 ప్రభాతవార్త



రాష్ట్రంలో అభివృద్ధి జరగాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలని రాయచోటి నియోజకవర్గం టీడిపి ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి ప్రజలను కోరారు. మంగళవారం రాయచోటి పట్టణంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలతో రాష్ట్రానికి ఇదేమి కర్మ కార్యక్రమాని ్న జోరుగా నిర్వహించారు. ఇంటింటి వెళ్లి తెలుగుదేశం ప్రభుత్వం చేపటిష్టన సంక్షేమ పథకాలు రద్దు చేసినవి ప్రజలకు తెలియజేస్తూ, వైసిపి ప్రభుత్వం చేస్తున్న అవినీతి అక్రమాలు గురించి ప్రజలకు వివరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఒక ౹ అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరితే ప్రజలు అవకాశం ఇస్తే ప్రజలనెత్తిన బస్మాసురుని చేయి పెట్టారన్నారు. ఈ కార్యక్రమం వల్ల ప్రతి ఒక్కరిని కలిసే అవకాశం వచ్చిందని ప్రజల యొక్క సాధక బాధకాలు తమకు తెలుస్తున్నాయన్నారు. ప్రజల సమస్యలను తాను స్వయంగా ప్రత్యక్షంగా చూస్తున్నానని రమేష్‌కుమార్‌రెడ్డి చెప్పారు. కార్యక్రమంలో గాజులఖాదర్‌బాష, ఖాదర్‌వలి, మురికినాటి వెంకటసుబ్బారెడ్డి, సత్యారెడ్డి, జాబీర్, మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కోడిపందేల జోలికి వెళితే కఠిన చర్యలు

సిఐ ఎస్.విశ్వనాథ్‌రెడ్డి

రైల్వేకోడూరు రూరల్, జనవరి 10 ప్రభాతవార్త



రైల్వేకోడూరు పట్టణంలోని 3 మండలాల్లో ఎవరైనా కోడిపందేలు జోలికి వెళ్లినా, ఆడినట్లు తెలిసినా కఠినచర్యలు తీసుకుంటామని రైల్వేకోడూరు సిఐ ఎస్.విశ్వనాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక సిఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఎవరైనా కోడిపందేలు, అసాంఘిక కార్యక్రమాలకు వెళ్లినా కఠినమైన చర్యలు ఉంటాయని ఆయన అన్నారు. జిల్లా ఎస్‌పి, డిఎస్‌పి ఆదేశాల మేరకు కఠినమైన ఆంక్షలు అమల్లో ఉన్నాయని ఆయన హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాల్లో కోడిపందేలు, జూదాలు నిర్వహిస్తే ప్రజలు కూడ తమవంతు సహకారాన్ని పోలీసులకు అందజేయాలని విశ్వనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ-1 మోహన్‌కుమార్‌గౌడ్, ఎస్ఐ-2 వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## సంక్రాంతి కోడిపందేలు, పేకాట వంటివి నిషేధం

ఎస్ఐ సుభాష్‌చంద్రబోస్

చిట్వేలి, జనవరి 10 ప్రభాతవార్త



తెలుగు ప్రజలందరూ అత్యంత సాంప్రదాయబద్ధంగా జరుపుకునే సంక్రాంతి పడుంగకు కోడిపందేలు, పేకాట వంటివి నిర్వహిస్తే కఠినచర్యలు తప్పవని మంగళవారం ఎస్ఐ సుభాస్‌చంద్రబోస్ పత్రికా ప్రకటనలో తెలియపరిచారు. అత్యంత భక్తిశ్రద్ధలతో, సంతోషాలతో మూడు రోజులు పాటు పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని అన్నారు. పండుగల సమయంలో కోడిపందాలకు, జూదాలకు ఒక్కరు సాహసించినా ఉపేక్షించేది లేదని చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి కఠినచర్యలు తీసుకుంటామని తెలియపరిచారు. పండుగలకు ఇతర ఊర్లకు వెళుతున్నవారు తమ ఇంటిలోని నగదు, బంగారు లాంటి విలువైన వస్తువులను జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## రాజంపేట సరస్వతివిద్యామందిర్ విద్యార్థులకు పతకాల పంట

రాజంపేట అర్బన్, జనవరి 10 ప్రభాతవార్త



రాజంపేట సరస్వతివిద్యామందిరం విద్యార్థులు జిల్లా, రాష్ట్రస్థాయిలో జరిగిన పోటీల్లో పతకాల పంట సాధించారు. కబడ్డీ, క్యారమ్స్, షటిల్, హైజంప్, 100 మీటర్ల పరుగుపందెం, షాట్‌పుట్ పోటీల్లో పతకాలను సాధించినట్లు ప్రధానోపాధ్యాయురాలు గౌరి చెప్పారు. ఈ మేరకు మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పతకాలు సాధించిన విద్యార్థులను పాఠశాల కమిటి సభ్యులు పోతుగుంట రమేష్‌నాయుడు, రమణారెడ్డి, తుమ్మలూరు చంద్రశేఖర్‌రెడ్డి అభినందించారు.

## కారు బోల్తా - ఎంపిడివో మల్‌రెడ్డికి గాయాలు

రామాపురం.జనవరి 10 ప్రభాతవార్త



కర్నూలు చిత్తూరు 40వ జాతీయ రహదారిలోని రామాపురం మండలం గువ్వల చెరువు ఘాట్‌రోడ్డు రెండో మలుపు దగ్గర మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు బోల్తాపడి ఎంపిడివో మల్‌రెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసల కథనం మేరకు రాయచోటి మండలం ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడివోగా విధులు నిర్వహిస్తున్న మల్‌రెడ్డి కారులో కడప నుంచి రాయచోటికి వస్తుండగా గువ్వల చెరువు ఘాట్‌రోడ్ రెండో మలుపు సమీపానికి రాగాను కారు బోల్తా పడింది. ఈ సంఘటనలో ఆయన తీవ్రగాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి రామాపురం పోలీస్‌లు చేరుకుని చికిత్స నిమిత్తమై 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు.

## బియ్యం మిల్లుపై విజిలెన్స్ అధికారుల దాడులు

ప్రొద్దుటూరు క్రైం, జనవరి 9, ప్రభాతవార్త:



ప్రొద్దుటూరు మండీ మర్చంట్ కాంప్లెక్స్‌లో రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచి నూకలు తయారు చేస్తుండగా మంగళవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేశారు. లారీ నెంబర్ ఏపీ04 టీఎక్స్ 2268లో తరలిస్తుండగా పట్టుకున్నట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. అక్రమంగా రేషన్ బియ్యాన్ని నూకలుగా తయారు చేస్తుండగా మిషన్లు, బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. 200 బస్తాలకు పైగా రేషన్ బియ్యం, నూకలు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు.

## ఆటల ద్వారా శారీరక మానసిక ఉల్లాసం పెంపొందుతుంది

–డిఎస్పీ శ్రీధర్

రాయచోటి.జనవరి 10 ప్రభాతవార్త



సమాజంలోని యువతకు ఆటల పోటీలు ద్వారా శారీరక మానసిక వికాసం పెంపొందుతుందని రాయచోటి డిఎస్‌పి శ్రీధర్ అన్నారు. రాయచోటి పట్టణం శ్రీసాయి ఇంజనీరింగ్ కళాశాల ఆవరణంలో మంగళవారం జరిగిన విలేజ్ క్లస్టర్ లెవల్ స్పోర్ట్స్ మీట్ కార్యక్రమానికి డిఎస్పీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా యువకులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆటల పోటీల ద్వారా యువతలో స్నేహ స్వభావం ఐకమత్యం ఉత్సాహం వికాసం లభిస్తుందని ఆయన చెప్పారు. సమావేశంలో శ్రీసాయి విద్యా సంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డా.ఎం.సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ విద్యుత్‌తో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని విద్యార్థులకు సూచించారు. క్రీడా సంస్కృతి నగరాలకే పరిమితం కాకుండా పల్లెలకు కూడా చేరవేసి గ్రామీణ ప్రాంత విద్యార్థులకు స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఆవశ్యకతను వివరించాలని సూచించారు. ఈ స్పోర్ట్స్ మీట్ నందు పది టీమ్‌లు పాల్గొన్నారు. అందులో శ్రీసాయి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు విజయం సాధించారని వివరించారు. సమావేశంలో విఆర్‌డిఎస్ స్వచ్ఛంద సంస్థ సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ఎంతో మంది నైపుణ్యం కలిగిన క్రీడాకారులు ఉన్నారని వారికి ప్రభుత్వం సక్రమయిన ప్రోత్సాహం ఇవ్వకపోవడంతో అలాగే ఉండిపోయారని ఆయన అన్నారు. అనంతరం వాలీబాల్ టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతలకు అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి రాఘవరెడ్డి చేతులు మీదుగా అవార్డులు ప్రదానం చేశారు.కార్యక్రమంలో జిల్లా స్థాయి క్రీడా అధికారులు, శ్రీసాయి కళాశాల విభాగాధిపతులు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 24 గంటల్లో చోరీకి గురైన మోటారు బైకులు

పట్టుకొన్న రాజంపేట అర్బన్ పోలీసులు

రాజంపేట అర్బన్, జనవరి 10 ప్రభాతవార్త



ఆర్ఎస్‌రోడ్డులో చోరీకి గురైన 2 మోటారుబైకులను 24 గంటల వ్యవధిలో పట్టుకొన్నారు. వివరాల్లోకి వెళితే రాజంపేట అర్బన్ సిఐ కథనం మేరకు బోయపాళెంకు చెందిన బయన బోయిన సుబ్బరాయుడు, ఆర్ఎస్‌రోడ్డులోని ఫ్లైఓవర్‌బ్రిడ్జి వద్ద మోటారుబైకు పార్కు చేసి రైల్వేస్టేషన్ వద్దకు పోయారు. పని చూసుకుని తిరిగి వచ్చేలోపే మోటారుబైకు మాయమైంది. దీనిపై అర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం రాజంపేట అర్బన్ ఎస్ఐ లక్ష్మీప్రసాద్‌రెడ్డి వెహికల్స్ తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూసి మోటారుబైకులను వెనక్కు తిప్పుకొని వెళ్లిపోవడం చూశారు. ఎస్ఐ వెంటనే తన వాహనంలో వారిని వెంబడించారు. ఇద్దరిని విచారించగా దొంగలించిన మోటారు బైకుల విషయం చెప్పారు. ఈ మేరకు కడప రవీంద్రనగర్‌కు చెందిన షేక్ సొహైల్, మరియాపురం వద్ద నివాసం ఉంటున్న వేల్పుల మహేంద్ర నుంచి 2 మోటారు బైకులను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

## 'వార్త' దినపత్రిక ఆధ్వర్యంలో రంగవల్లుల పోటీలు

(మొదటి పేజీ తరువాయి)

ఈ సంవత్సరం పెద్ద ఎత్తున మహిళలు పాల్గొనడమే గాక, మహిళలు ముగ్గుల పోటీల్లో ఆసక్తి చూపుతున్నారంటే మన సాంప్రదాయాలు ఉట్టిపడేలా కనపడుతుందన్నారు. 'వార్త' యాజమాన్యం ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్ళడమే గాక నిరంతరాయంగా ప్రజల్లో ఉంటూ చెరగని ముద్ర వేసుకోవడమే గాక ప్రజలందరి మన్ననలు పొందిందన్నారు. వార్త దినపత్రిక సాంప్రదాయాలను మరువకుండా ఉండేందుకు కొన్ని సంవత్సరాలుగా రంగవల్లుల పోటీలు నిర్వహించి మహిళల ప్రతిభను వెలికి తీయడం జరుగుతుందన్నారు. ఈ పోటీలకు ప్రతి ఒక్కరి సహకారంతో పాటు, వార్త ఆధ్వర్యంలో నిర్వహించే రంగవల్లుల పోటీలలో పాల్గొనే మహిళలందరికీ ప్రోత్సాహక బహుమతులకు సహకరించిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు. జూటూరు డిజిటల్స్ అధినేత జూటూరు మధుసూదన్‌రావు, రెడ్డి చికెన్ సెంటర్ అధినేత గాజులపల్లె వెంకట రమణారెడ్డి, యాదాళ్ళ కృష్ణమూర్తితో పాటు పలు వురు మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలకు నిలయంగా వార్త దినపత్రిక ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం సంక్రాంతి పండుగ పురస్కరించుకొని మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి జిల్లాలో ఎక్కడా లేని విధంగా విలువైన బహుమతులను ప్రోత్సాహకంగా మహిళలకు అందజేయడం ఎంతో సంతోషకరం అన్నారు. ఇటువంటి కార్యక్రమాలు మరెన్నో చేపట్టాలని వార్త పత్రిక చేస్తున్న పలు కార్యక్రమాలకు తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. వ్యవసాయ మార్కెట్ యార్డులో ముగ్గుల పోటీలకు సహకరించిన మార్కెట్ యార్డు ఛైర్మెన్ పుత్తా లక్ష్మీదేవి, వైస్ ఛైర్మెన్ నాగం సుబ్బారెడ్డి, మార్కెట్ యార్డు సెక్రటరి నాగిరెడ్డికి వార్త సిబ్బంది కృతజ్ఞతలు తెలియజేశారు.

**ఐదుగురు న్యాయ నిర్ణేతలతో రంగవల్లుల పరిశీలన :**

వార్త దినపత్రిక ఆధ్వర్యంలో నిర్వహించిన రంగవల్లుల పోటీలలో మహిళలు తీర్చిదిద్దిన ముగ్గులను ఐదుగురు న్యాయ నిర్ణేతలు పబ్బతి శ్రీదేవి, నాగిరెడ్డి సుబ్బమ్మ, చక్రపాణి ఉమా, పత్తి పుష్పలత, మేడా తులసి హైమావతి సుమారు గంటకు పైగా పరిశీలించి విజేతలను ఎంపిక చేయడం జరిగింది. ముగ్గుల పోటీల్లో విజేతలను ఎంపిక చేసేందుకు గంటకు పైగా శ్రమించి పరిశీలించిన అనంతరం విజేతలను ఎంపిక చేసి మొదటి బహుమతి ఎంఐ ఎల్ఈడి టీవిని డిఎస్పీ వంశీధర్ గౌడ్ సెల్ పాయింట్ అసోషియేషన్ వారి సహకారంతో అందజేయడంతో పాటు, రెండవ బహుమతి వాషింగ్ మెషిన్ బొమ్మన ఫౌండేషన్ నిర్వాహకులు బొమ్మన సుబ్బరాయుడు, డైరెక్టర్ విజయ్, మూడవ బహుమతి ఒనిడా ఫ్రిడ్జ్ జూటూరు డిజిటల్స్ అధినేత జూటూరు మధుసూదన్‌రావు, నాల్గవ బహుమతి బీరువా పద్మావతి ఫర్నీచర్ అధినేత అరవ శ్రీనివాసులు యాదవ్, ఐదవ బహుమతి బట్టర్ ఫ్లై కంపెనీ మిక్సీ గరుడ సింహ్ ప్లైవుడ్ అండ్ హార్డ్‌వేర్స్ అధినేత గురునాథ్, ఆరవ బహుమతి పోలార్ కంపెనీ పెడస్టల్ ఫ్యాన్ పిఆర్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి మానుగుంట రవిశంకర్ సహకారంతో అందజేయడం జరిగింది. అలాగే ముగ్గుల పోటీలకు విచ్చేసిన సుమారు 200 మందికి టీడీపీ సీనియర్ నాయకులు నాగిరెడ్డి జనార్ధన్ రెడ్డి, 25వవార్డు కౌన్సిలర్ నాగిరెడ్డి శివమ్మ కుటుంబ సభ్యుల సహకారంతో అందజేయడం జరిగింది. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న పలువురు మహిళలకు ప్రోత్సాహక బహుమతులు, డెకరేషన్, ఫ్లెక్సీలకు సహకరించిన విశ్వసాయి కళాశాల ఛైర్మెన్ డా॥ సత్యనారాయణ, రెడ్డి చికెన్ సెంటర్ అధినేత గాజులపల్లె రమణారెడ్డి, నెల్లూరు ఎనెల్ స్పెషాలిటీ హాస్పిటల్ కార్డియాలజిస్ట్ డా॥ కులారి నాగేంద్ర ప్రసాద్ యాదవ్, లీగల్ రిపోర్టర్ రూపరాజు చంద్రశేఖర్ రావు, జిఎస్ గోల్డ్ ప్యాలెస్ అధినేత గానుగపెంట రమేష్ బాబు, నరసింహ చారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్ నరసింహ, షాకీర్ గ్లాస్ షాప్ షేక్ షాకీర్ హుస్సేన్, ఎస్ఎంఆర్–2 చికెన్ సెంటర్ సయ్యద్ ఖాజా, ప్రైవేట్ సీనియర్ సర్వేయర్ రూపరాజు శ్రీనివాసరావు, కెజిఎన్ గ్లాస్ షాప్ షేక్ చాన్‌బాష, దినేష్ ఆర్థోపిడిక్ డా॥ వెంకట శివ దినేష్, జి.వి.రమణారెడ్డితో పాటు పలువురు దాతల సహకారంతో ఏర్పాటు చేయడం జరిగింది. ముగ్గుల పోటీలకు సహకరించిన దాతలను స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో తహసీల్దారు మల్లిఖార్జున రెడ్డి, సీఐ వెంకటేశ్వర్లు, వార్త బ్యూరో రఘునాథ్, సీనియర్ సర్కులేషన్ మేనేజర్ వెంకటేశ్వరరావు, స్టాఫ్ రిపోర్టర్ భూమిరెడ్డి వెంకటేష్‌తో పాటు పలువురు వార్త సిబ్బంది చేతుల మీదుగా శాలువాలతో సత్కరించి ప్రత్యేక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వార్త సిబ్బంది వల్లంకొండు వెంకట రమణ, తుమ్మలూరు మునెయ్య, కల్లూరు దస్తగిరి, కేశవరెడ్డి, భాస్కర్ రెడ్డి, సుబ్బయ్య, ప్రసాద్‌తో పాటు శివ సాయి ఈవెంట్స్ సాయి, టీచర్ రమణ, ఆవులేటి శేఖర్ రాయల్, బండారు సురేష్ బాబు, హరి, వల్లంకొండు రాఘవేంద్ర, అనీత్, ఓలేటి సురేంద్రతో పాటు పలువురు పాల్గొన్నారు.



బహుమతులు పొందిన మహిళలను అభినందిస్తున వార్త సిబ్బంది

## క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే తనయుడు

వీరబల్లి.జనవరి 10 ప్రభాతవార్త



మండలంలో సానిపాయి పంచాయతీలో కొత్తపేట దగ్గర ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను సోమవారం రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి తనయుడు క్రిష్ణతేజ్ రెడ్డి ప్రారంభించారు. ఈయనతో రాయచోటి రూరల్ సిఐ లింగప్ప పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ నాడు ప్రపంచంలో క్రికెట్ అనేది యువతి యువకుల్లో ముఖ్య ఆటగా మారిందన్నారు. యువతి యువకులు ఆటల్లో విరివిగా పాల్గొని శారీరకంగా మానసికంగా ఉల్లాసంగా వికాసం పొందాలన్నారు. ఆటలు అభివృద్ధి చెందడానికి ఎంతో తోడ్పడుతాయని చెప్పారు. అదేవిధంగా ఉన్నత స్థాయికి ఎదిగి మంచి గుర్తింపు తెచ్చుకోవచ్చని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి సభ్యులు వైసిపి నాయకులు సీతారామరాజు, చందు రాజు కలిసి ఎమ్మెల్యే తనయుడు కలసి ఆటగాళ్లకు 32 క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్య క్రమంలో స్థానిక నాయకులు, విద్యార్థులు, ఉన్నతపాఠశాల పిడి రాజు పాల్గొన్నారు.

## రాజంపేట నియోజకవర్గపు రెవెన్యూ డివిజనల్ అభివృద్ధి కమిటి చైర్మన్‌గా రవిశంకర్

వీరబల్లి.జనవరి 10 ప్రభాతవార్త



మండలంలో సంగంవాండ్లపల్లి పంచాయతీ గ్రంధేవాండ్లపల్లికు చెందిన కోటగుంట రవిశంకర్‌ను రాజంపేట నియోజకవర్గపు రెవెన్యూ డివిజనల్ అభివృద్ధి కమిటి చైర్మన్‌గా ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, సహాయ సహకారాలతో ఎంపిక చేసినట్లు తెలిపారు. వారు నామీద ఉంచిన నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా పార్టీ అభివృద్ధికి నాకు అప్పచెప్పిన పదవికి న్యాయం చేస్తానని తెలిపారు.

## ఆటల ద్వారా ఐకమత్యం పెంపొందుతుంది

-సుగవాసి ప్రసాద్‌బాబు

రాయచోటి.జనవరి 10 ప్రభాతవార్త



ఆటల ద్వారా యువకులలో ఆప్యాయత అనురాగం ఐకమత్యం స్నేహభావాలు పెంపొందుతాయని టీటీడి పాలకమండలి మాజీ సభ్యుడు సుగవాసి ప్రసాద్‌బాబు అన్నారు. మంగళవారం రాయచోటి పట్టణం నమాజ్‌గిరి ఈద్గాలో రాయచోటి మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీలకు ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇరువురి జట్లను పరిచయం చేసుకుని, టాస్ వేసి ఆటను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడిపి నాయకులు నవాజ్, మండ్లసతీష్, ముత్తుకూరు రఫి, టిఎన్ఎస్ఎఫ్ శివ, నాగ, ఆఫ్రోజ్, బడిశెట్టి రవి, తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న పక్కా గృహాలను పరిశీలించిన ఎంపిడివో హైదర్‌వలి

రామాపురం.జనవరి 10 ప్రభాతవార్త



మండలంలోని గువ్వలచెరువు కస రెడ్డిగారిపల్లి పంచాయతీలకు సంబందించిన జగనన్న పక్కాగృహాలను రామాపురం మండలం అభివృద్ది అధికారి హైదర్‌వలి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న పక్కా గృహాలను వెంటనే త్వరితగతిన నాణ్యతతో పూర్తిచేయాలని ఎంత తొందరగా పూర్తిచేస్తే అంత తొందరగా ఇంటికి సంబందించిన బిల్లులు లబ్దిదారులకు తొందరగా అందుతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, గువ్వలచెరువు గ్రామ ఎంపిటిసి మౌలాలి పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుక రవాణా : అడ్డుకున్న స్థానికులు

టి.సుండుపల్లి.జనవరి 10 ప్రభాతవార్త



మండలంలోని కాల్వపల్లి ఇసుక రీచ్ నుంచి 6 టిప్పర్లు హిటాచిలతో వచ్చిన స్థానికులు ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక అక్రమ రవాణాలకు ప్రయత్నించగా కావలిపల్లి చీనేవాండ్లపల్లి మరియు రాయవరం కస్పావాసులు అడ్డుకున్నారు. గతములో ఒక అబ్బాయి ఈత కోసం వెళ్లి ఇసుక రీచ్‌లో పడి ప్రాణాపాయ స్థితిలో ఉండగా ఎస్ఐ, ఎంఆర్‌వోలుతో మాట్లాడగా వారు స్పదించి 5లక్షల నష్టపరిహారం ఇప్పిస్తామని హామీ ఇచ్చారని ఇవ్వకపోగా ఈనాడు ఇసుక తరలించడానికి రాగ దానికి రీచ్ దగ్గరకు రాగా విషయం తెలుసుకున్న స్థానిక వైసిపి నాయకుడు బద్రి రమేష్ వెంటనే రీచ్ దగ్గరికి పోయి ప్రజలతో కలిసి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్నట్లు తెలిపారు. అంతే కాకుండా కావలిపల్లి అబ్బాయికి నష్టపరిహారం కట్టించి రీచ్ పక్కనే ఉన్న భూములు రైతులకు నష్టం కలిచే చర్యలు ఆపాలన్నారు.

## గరుగుపల్లి దళితవాడకు స్మశానవాటిక ఏర్పాటు చేయాలి

గాలివీడు.జనవరి 10 ప్రభాతవార్త



గాలివీడు గరుగుపల్లి దళితవాడకు స్మశానవాటిక ఏర్పాటు చేయాలని సిపిఐ మండల కార్యదర్శి నచ్చు బాస్కర్ అన్నారు. మంగళవారం దళితవాడలోని సమస్యలపై ఇంటింటికి తిరిగి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలయినా నేటికి దళితవాడలో పేదరికం నిరక్షరాశ్యత అంటరాని తనం అవమానాలతో దళితుతు బతుకు ఎల్లబుచ్చుతున్నారన్నారు. ఇప్పటికి కనీసం చనిపోతే పూడ్చుకోవడానికి ఆరడుగుల భూమిలేదని రాజకీయ నాయకులు మాత్రం ఉపన్యాసాలు తప్ప ఏమి చేసింది లేదన్నారు. మండలంలోని అన్ని దళితవాడలకు సిసి రోడ్లు, డ్రైనేజి వ్యవస్థ తాగునీరు, స్మశానవాటిక కనీస అవసరాలను ఏర్పాటు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సహాయకార్యదర్శి కృష్ణమూర్తి, దీపక్, లోకేష్‌బాబు, ముత్తయ్య, చంద్ర, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## షటిల్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన ఎస్ఐ

గాలివీడు.జనవరి 10 ప్రభాతవార్త



చెక్కవాండ్లపల్లి ఓపెన్ కోర్టు షటిల్ టోర్నమెంట్ మంగళవారం ఎస్ఐ వెంకటశివకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాయామం ప్రతి ఒక్కరి ఆరోగ్యానికి చాలా మంచిదని అందులో షటిల్ క్రీడ చాలా ఉత్తమమైనదని అన్నారు. ఈ షటిల్ టోర్నమెంట్ పశ్చిమరాయలసీమ ఎమ్మెల్సీ అభ్యర్థి బండ్ల మదన్‌మోహన్‌రెడ్డి సహకారంతో జరుగుతున్నదని ఆర్గనైజర్స్ శ్రీనివాసులు రాజు, మురలీధర్ రెడ్డి, ఉపేంద్ర పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకటశివకుమార్ చేత రిబ్బన్ కట్ చేయించి అతని దుశ్శాలువతో సత్కరించారు. ఈ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి షటిల్ ప్లేయర్స్ మరియు యువకులు పాల్గొన్నారు.

## నేడు ఒంటిమిట్టకు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుగిడుగు రుద్రరాజు రాక

ఒంటిమిట్ట, జనవరి10 ప్రభాతవార్త:

నేడు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఆధ్యక్షుడు గిడుగు రుద్రరాజు విచ్చేస్తున్నట్లు రాజంపేట కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సోమిశెట్టి మనోహర్‌బాబు తెలిపారు. బుధవారం సాయంత్రం 5 గంటలకు ఒంటిమిట్టలోని కోదండరామాలయానికి విచ్చేస్తారన్నారు. ఈయనతోపాటురాష్ట్ర మీడియా ఆధ్యక్షుడు తులసిరెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ జంగా గౌతం, ఏపిసిసి ప్రదాన కార్యదర్శి మయ్యప్పన్‌జిల్లా ఆధ్యక్షుడు నీలిశ్రీనివాసులు తదితరులు వస్తున్నట్లు ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని తెలిపారు.